సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
బుధవారం, 09.09.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 310
పేజీలు: 08 వెల: రూ. 5

## పోలీసులు, పాలకపక్షానికి ఎదురుదెబ్బ

### పోలీసుల రిమాండ్ పిటిషన్ తిరస్కరణ

- రూ.10 వేల పూచీకత్తుతో విడుదల
- తాతా మధు, నవీన్‌కు బిగ్ రిలీఫ్
- పోలీసులకు నాంపల్లి కోర్టు షాక్

02




# పొలిటికల్ మైలేజ్ గేమ్

## కాంగ్రెస్ vs బీఆర్ఎస్‌తో రణరంగంగా తెలంగాణ

### పోలీసుల తీరుతో బీఆర్ఎస్‌కు అడ్వాంటేజ్..

- తాతా మధు ఆవేశంతో మిస్సయిందా?
- అసెంబ్లీ తొలిరోజే పొలిటికల్ గేమ్
- నల్లచొక్కాలతో హీట్ పెంచిన గులాబీ పార్టీ
- పోలీసులు అడ్డుకోవడంతో అనుకూలంగా మారిన పరిస్థితులు
- ఒక్క వ్యాఖ్యతో సీన్ రివర్స్.. డిఫెన్స్‌లో బీఆర్ఎస్
- తాతా మధు వ్యాఖ్యలను పట్టుకుని కాంగ్రెస్ ఎదురుదాడి
- వివరణ ఇచ్చి వ్యాఖ్యలను ఉపసంహరించుకున్న ఎమ్మెల్సీ
- మైలేజ్ కోసం రెండు పార్టీల పాట్లు




**ముద్ర డెస్క్ :**
తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాల తొలిరోజే అసెంబ్లీ ప్రాంగణం రాజకీయ వేడికి వేదికగా మారింది. సభలో ప్రభుత్వాన్ని నిలదీయడానికి ప్రతిపక్షాలు సిద్ధమవుతుండగా.. సభ ప్రారంభానికి ముందే అసెంబ్లీ వెలుపల చోటుచేసుకున్న పరిణామాలు అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య మరో రాజకీయ సమరానికి తెరతీశాయి. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, అసెంబ్లీ సమావేశాల తొలిరోజే తమ వాయిస్‌ను బలంగా వినిపించేందుకు బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా నల్లచొక్కాలు ధరించి, ప్లకార్డులతో నిరసనకు దిగింది. కేటీఆర్, హరీశ్‌రావు సహా గులాబీ పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ ఆందోళనలో పాల్గొనడంతో అసెంబ్లీ పరిసరాల్లో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది.

**నల్లచొక్కాలతో హీట్ పెంచిన బీఆర్ఎస్**

అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యే సమయానికి ముందే బీఆర్ఎస్ నేతలు నిరసనకు దిగడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ప్రజా సమస్యలు, పాలనలో వైఫల్యాలను ప్రధాన అస్త్రాలుగా చేసుకుని అధికార పార్టీని ఇరుకున పెట్టాలన్నది బీఆర్ఎస్ వ్యూహంగా కనిపించింది. నల్లచొక్కాలు ధరించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన చేపట్టడంతో మీడియా దృష్టి మొత్తం బీఆర్ఎస్ వైపు మళ్లింది.
కేటీఆర్, హరీశ్‌రావు నేతృత్వంలో గులాబీ పార్టీ నేతలు దూకుడుగా వ్యవహరించడంతో.. సమావేశాల తొలిరోజే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షం ఒత్తిడి పెంచినట్లయింది. సభలోకి వెళ్లకముందే ప్రభుత్వం, పోలీసులు, ప్రతిపక్షం మధ్య ఉద్రిక్త వాతావరణం ఏర్పడటం బీఆర్ఎస్‌కు కలిసొచ్చింది.

**బీఆర్ఎస్‌కు మైలేజ్**

బీఆర్ఎస్ నిరసనకారులను పోలీసులు అడ్డుకోవడంతో అసెంబ్లీ గేటు వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనకారులను లోపలికి అనుమతించకుండా పోలీసులు అడ్డుకోవడం, ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. పోలీసుల తీరును బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా తప్పుబట్టారు.
ఈ పరిణామం బీఆర్ఎస్‌కు రాజకీయంగా మరో అంశాన్ని అందించినట్లయింది. ప్రజా సమస్యలపై నిరసనకు దిగిన తమను ప్రభుత్వం అడ్డుకుంటోందని, ప్రతిపక్ష గొంతును నొక్కే ప్రయత్నం జరుగుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించే అవకాశం ఏర్పడింది. దీంతో తొలుత జరిగిన పరిణామాలన్నీ గులాబీ పార్టీకి అనుకూలంగా మారుతున్నట్లే కనిపించాయి. ప్రభుత్వంపై విమర్శలు చేయాలన్న బీఆర్ఎస్ లక్ష్యం కొంతవరకు నెరవేరినట్లే కనిపించింది. మీడియా కవరేజ్ కూడా నిరసనల చుట్టూనే తిరగడంతో.. అసెంబ్లీ సమావేశాల తొలిరోజు పొలిటికల్ నరేటివ్‌ను బీఆర్ఎస్ తనకు అనుకూలంగా మలుచుకుంటుందన్న అభిప్రాయం ఏర్పడింది.

**కానీ.. ఒక్క వ్యాఖ్యతో మొత్తం సీన్ రివర్స్**

అయితే ఈ పరిస్థితి ఎక్కువసేపు కొనసాగలేదు. పోలీసులతో జరిగిన తోపులాట, వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసే క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు ఒక్కసారిగా రాజకీయ దుమారం రేపాయి. ఆయన వ్యాఖ్యలు స్పీకర్ పదవిని, సభా గౌరవాన్ని కించపరిచేలా ఉన్నాయంటూ అధికార కాంగ్రెస్ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీంతో అప్పటి వరకు పోలీసుల తీరుపై సాగుతున్న చర్చ ఒక్కసారిగా తాతా మధు వ్యాఖ్యల వైపు మళ్లింది. ప్రభుత్వం వైఫల్యాలపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలు, పోలీసుల తీరుపై ప్రతిపక్షం లేవనెత్తుతున్న ప్రశ్నలు వెనక్కి వెళ్లిపోయి.. మిగతా 02లో



## కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద ఉద్రిక్తత

### ఎర్రవల్లిలో హైటెన్షన్

- కేసీఆర్ ఫామ్ హౌస్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం
- స్పీకర్ ను అవమానించారని నిరసన
- కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్
- చుట్టు పక్కల ప్రాంతాల్లో భారీగా మోహరించిన పోలీసులు
- ఫామ్ హౌస్ వైపు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు
- అసెంబ్లీ నుంచి ఫాంహౌస్ కు బయల్దేరిన కేటీఆర్, హరీశ్
- హకీంపేట వద్ద పోలీసుల అడ్డగింత, బైఠాయించిన నేతలు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య బాహాబాహీ

**ముద్ర, హైదరాబాద్ :**
మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడికి కాంగ్రెస్ శ్రేణులు ప్రయత్నించడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శాసనసభ స్పీకర్‌ను అవమానించారని ఆరోపిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు నిరసనకు దిగారు. కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఫామ్‌హౌస్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు అప్రమత్తమై ఫామ్‌హౌస్ చుట్టుపక్కల భారీగా బలగాలను మోహరించారు.
కాంగ్రెస్ శ్రేణుల ముట్టడి యత్నం నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు కూడా పెద్ద సంఖ్యలో ఫామ్‌హౌస్ వైపు తరలివచ్చారు. దీంతో ఎర్రవల్లి, హకీంపేట పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు.
ఇదిలా ఉండగా.. అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు బయల్దేరారు. హకీంపేట వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ నేతలు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. మిగతా 02లో



## కేసీఆర్ హత్యకు కుట్ర!

### మా నాయకుడిని కాపాడుకుంటాం: బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి

- ఎర్రవల్లి ఘటనపై కాంగ్రెస్ పై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం..
- ప్రజా సమస్యలపై చర్చకు సిద్ధం కావాలి
- కాంగ్రెస్ అణచివేతకు భయపడం
- ఫాంహౌస్ కు ఎమ్మెల్యేలను పంపడం ఏ సంస్కారం?

02

## తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డికి షాక్

### స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలపై చర్య

02

- ఈ ఇద్దరు ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు
- ప్రస్తుత సెషన్స్ మొత్తానికి వేటు
- తెలంగాణ మండలి కీలక నిర్ణయం
- శాసన సభలో తీర్మానం.. మండలికి కాపీ



## టీచర్ల నియామకం చెల్లదు

- టీచర్ల నియామకాలపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు..
- నిబంధనలకు లోబడే నియామకాలు ఉండాలి.
- స్కూళ్లు, కాలేజీలకు సుప్రీంకోర్టు ఆదేశాలు
- అర్హతలేనివారికి ఇక నో ఎంట్రీ

02



## డేటా సెంటర్లతో ఉద్యోగాలు

- నీటి కొరత లేదు: ఏపీ సీఎం చంద్రబాబు
- మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి
- నదుల అనుసంధానంతో భారీ నీటి నిల్వలు
- టీడీపీకే తొలి ప్రాధాన్యం: లోకేష్

03



## భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తే ఊరుకోం

### జర్నలిస్టులపై దాడులను ఖండించిన టీయుడబ్ల్యూజే

06

- హైదరాబాద్ లో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన
- మీడియా స్వేచ్ఛకు భంగం కలిగిస్తే ప్రతిఘటన




## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది కాంప్రమైజ్ పాలిటిక్స్

### కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్



- కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ప్రజలను మోసం చేస్తున్నాయి
- అసెంబ్లీలో రాజకీయ డ్రామాలు ఆపాలి
- కేసీఆర్ అసెంబ్లీకే రారు.. హోదా ఎందుకు?
- డైవర్షన్ పాలిటిక్స్ కట్టిపెట్టి ప్రజా సమస్యలపై చర్చించాలి

02

## యువతే దేశ భవిష్యత్

02

### తప్పుదోవ పట్టించేవారు ప్రతి మలుపు వద్దా ఉంటారు



- అబద్ధాలను అధిగమిస్తారు
- రాహుల్‌పై మోదీ విమర్శలు
- ఏఐ యుగానికి సిద్ధం కావాలి
- యూపీఏ పాలనపై ప్రధాని మోదీ విమర్శలు
- వడోదరలో 'దురంధర్' పాటతో మోదీ ఎంట్రీ

## ఇదీ AI ముద్ర





జుట్టు రాలుతోందా?

గతంతో పోలిస్తే పోనీటైల్ వాల్యూమ్ తగ్గడం జుట్టు సాంద్రత క్రమంగా తగ్గుతున్న సంకేతం కావచ్చు.

# కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుని బాహాబాహీకి దారితీసింది. ఇరు వర్గాలు పరస్పరం చెప్పులు, రాళ్లు విసురుకున్నట్లు సమాచా రం. కేసీఆర్, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను ఇరు వర్గాలు దహనం చేశాయి. పరిస్థితి అదుపుతప్పే అవకాశం ఉండటంతో పోలీసు లు రంగంలోకి దిగి ఇరువర్గాలను చెదరగొట్టారు.

అనంతరం కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. మరోవైపు కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను పోలీసులు పూర్తిగా దిగ్బంధించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఎర్రవల్లి పరిసరాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల ఆందోళనలతో ఉద్రిక్తత కొనసాగుతోంది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు భారీగా బలగాలను రంగంలోకి దించారు.

# యువతే దేశ భవిష్యత్

**ముద్ర, ముంబై:**

యువత ఆకాంక్షలు, గళం.. విపక్షాల అబద్ధాలను అధిగమిస్తాయని ప్రధాని మోదీ అన్నారు. తప్పుదోవ పట్టించాలని చూసేవారు మన ప్రయాణంలో ప్రతి మలుపు వద్దా కనిపిస్తారని, కానీ భారత యువత సత్యాన్నే అనుసరిస్తుందని చెప్పారు. దేశ భవిష్యత్తును వారే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్



అగ్రనాయకుడు రాహుల్ గాంధీ 'Chhatron Ki Goonj' (విద్యార్థుల ప్రతిధ్వని) పేరిట విద్యార్థులతో మాట్లాడుతోన్న సంగతి తెలిసిందే. దానిని ఉద్దేశించే మోదీ విమర్శలు చేశారు. గుజరాత్ లోని వడోదరలో 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

"దేశంలో ప్రభుత్వాల పని సంస్కృతిలో వచ్చిన మార్పునకు వెస్ట్రర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (WDFC) ఒక ఉదాహరణ. దానికి సంబంధించి చివరి దశకూడా పూర్తయింది. 2004లో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. దీని అమలు కోసం 2006లో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. 2014 వరకు దానికి సంబంధించిన ఫైళ్లు అక్కడక్కడే తిరిగాయి'' అని యూపీఏ పాలనపై మోదీధ్వజమెత్తారు. 10 ఏళ్లలో వారు 50వేల టాయిలెట్లు కూడా కట్టించలేదని, తాము మాత్రం 50వేల రైలు కోచ్‌లను నిర్మించామని వెల్లడించారు.

అనంతరం యువత గురించి మాట్లాడిన ప్రధాని.. ఏఐ యుగానికి అంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఏఐ నైపుణ్యాలు ఐటీ రంగానికి మాత్రమే పరిమితం కాకూడదని సూచించారు. అలాగే రూఫ్‌టాప్ సోలార్ విస్తరణ గురించి ప్రస్తావించారు. 'ఇప్పుడు ఎన్నో కుటుంబాలు ఎలక్ట్రిసిటీ ఉత్పత్తిదారులుగా మారాయి. సౌర ఉత్పత్తి, అమర్చడం, సర్వీస్ విస్తరించడంతో యువతకు ఉపాధి పెరిగింది' అని పేర్కొన్నారు. ఇప్పుడు దే శం చిప్స్ నుంచి షిప్స్ వరకూ తయారీ రంగంలో కొత్త చరిత్ర లిఖిస్తోందన్నారు.

**ధురంధర్ పాటతో స్వాగతం..**

'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో భాగంగా మోదీ వస్తుండగా.. వేదికపైన ధురంధర్ సినిమాలోని 'Aari Aari', క్వీన్ చిత్రంలోని 'We Will Rock You' పాటలు వినిపించాయి. యువత నినాదాల మధ్య ప్రధానిని ఘనంగా స్వాగతించారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ లది కాంప్రమైజ్ పాలిటిక్స్

**ముద్ర, హైదరాబాద్ :**

తెలంగాణ శాసనసభ సమావేశాల తీరు, అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీల వ్యవహార శైలిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇవాళ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇరు పార్టీలు ప్రజా సమస్యలను గాలికొదిలేసి రాజకీయ డ్రామాలతో ప్రజలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. అసెంబ్లీలో జరుగుతున్న పరిణామాలను చూసి రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారని, నేతల బజారు భాష చూసి నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 'నువ్వు కొట్టినట్లు చేయ్.. నేను ఏడ్చినట్లు చేస్తా' అన్న చందంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు లాలూచీ రాజకీయాలు చేస్తూ ప్రజలను పిచ్చోళ్లను చేస్తున్నారని బండి ఆరోపించారు.




**బీఆర్ఎస్ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలి..**

స్పీకర్‌పై బీఆర్ఎస్ నేతలు అసభ్య పదజాలంతో దూషించడాన్ని ప్రజాస్వామ్యవాదులెవరూ జీర్ణించుకోలేరని స్పష్టం చేశారు. తాతా మధుతో పాటు విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై చేయి చేసుకున్న బీఆర్ఎస్ నేతలను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కలుగులో దాక్కున్నారని, అసెంబ్లీకే రానప్పుడు ఆయనకు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఎందుకని నిలదీశారు. రాష్ట్రంలో 22A నిషేధిత భూముల సమస్యతో ప్రజలు అల్లాడిపోతుంటే, మంత్రులు, అధికార పార్టీ నేతలు వేల కోట్ల రూపాయల భూదందాలకు పాల్పడుతున్నారని బండి సంజయ్ ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాక, సర్టిఫికెట్లు అందక లక్షలాది మంది విద్యార్థులు అరిగోస పడుతున్నారని అన్నారు. సాగునీరు లేక దక్షిణ తెలంగాణ రైతాంగం ఆందోళనలో ఉందని, ఉద్యోగాలు లేక నిరుద్యోగులు, డీఏలు–పెండింగ్ బిల్లులు రాక ఉద్యోగులు, ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీల అమలు ఊసేలేదని.. ఇక రెండు రోజుల పాటు ఒకే అంశంపై చర్చించి విలువైన సభా సమయాన్ని వృథా చేయడం దుర్మార్గమన్నారు.

**గాయాలని డ్రామాలు..**

ఇక ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన బీజేపీ కార్యకర్తలపై పోలీసులు రక్తం కారేలా లాఠీచార్జ్ చేయడం దారుణమని బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ నేతలకు ఎలాంటి దెబ్బలు తగలకపోయినా ఏదో జరిగిపోయినట్లుగా డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందేనని, రెండు పార్టీలు కలిసి ప్రజలను దోచుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా డైవర్షన్ రాజకీయాలు, డ్రామాలు కట్టిపెట్టి అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు చూపాలని బండి సంజయ్ హితవు పలికారు.

# తాతా మధు, నవీన్ కు షాక్

**ముద్ర, హైదరాబాద్:**

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. ఇద్దరినీ సస్పెండ్ చేయాలని శాసనమండలిలో మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్.. సెషన్ మొత్తానికి ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. అనంతరం మండలి వాయిదా పడింది.

అంతకుముందు శాసనసభ కూడా తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని తీర్మానించింది. మంత్రి దామోదర రాజనర్సింహ ఈ మేరకు సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. "స్పీకర్‌పై తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి దూషణలను సభ తీవ్రంగా ఖండిస్తోంది. సభామర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలపై నిరసన తెలుపుతోంది. మహిళల ఎదుట అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తోంది. బీఆర్ఎస్ సభ్యుల అనుచిత ప్రవర్తలను ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత తీసుకోవాలి. శాసనసభాపతికి కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి. నిబంధనలకు అనుగుణంగా మండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలి'' అని శాసనసభ తీర్మానించింది.

# పోలీస్ వాహనం చోరీ

**ముద్ర, కరీంనగర్ :**

కరీంనగర్ జిల్లాలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో పెట్రోల్ వాహనం చోరీ కలకలం రేపుతోంది. గంజాయి మత్తులో ఓ యువకుడు ఏకంగా పోలీసు వాహనాన్ని ఎత్తుకెళ్లాడు. వెంటనే గుర్తించిన పోలీసులు వాహనం కోసం వెతుకులాట మొదలు పెట్టారు. అయితే గంజాయి మత్తులో ఉన్న యువకుడు ర్యాష్ డ్రైవింగ్ చేసి ఎల్కతుర్తి దగ్గర అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఆపై పోలీస్ క్యాప్ పెట్టుకుని వాహనాలను ఆపేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో అటుగా వచ్చిన ఎల్కతుర్తి పోలీసులు అనుమనం వచ్చి కరీంనగర్ రూరల్ పోలీసులకు సమాచారం అందజేశారు. అప్పటికే వాహనం మిస్సింగ్‌పై కరీంనగర్‌లో పోలీసులు వెతుకుతున్నారు. అసలు విషయం తెలిసిన వెంటనే ఎల్కతుర్తి పోలీసులు.. వాహనంతో పాటు గంజాయి మత్తులో ఉన్న యువకుడిని ఎల్కతుర్తి నుంచి కరీంనగర్‌కు తీసుకెళ్లారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. యువకుడి వివరాలు సేకరించే పనిలో ఉన్నట్లు సమాచారం.

# పొలిటికల్ మైలేజ్ గేమ్

(మొదటి పేజీ తరువాయి)

స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణ ప్రధాన అంశంగా మారింది. ఇదే బీఆర్ఎస్‌కు పెద్ద రాజకీయ ఇబ్బందిగా మారింది.



**కాంగ్రెస్‌కు దొరికిన అస్త్రం**

బీఆర్ఎస్ నిరసనలతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతున్న సమయంలో.. తాతా మధు వ్యాఖ్యలు కాంగ్రెస్‌కు అనూహ్యమైన రాజకీయ అస్త్రంగా మారాయి. అధికార పార్టీ నేతలు వెంటనే ఈ అంశాన్ని అందిపుచ్చుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

సభాపతి స్థానానికి గౌరవం ఇవ్వకుండా మాట్లాడారని, రాజ్యాంగబద్ధమైన పదవిని అవమానించారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ముఖ్యంగా స్పీకర్ సామాజిక నేపథ్యాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నేతలు ఈ అంశాన్ని మరింత విస్తృత రాజకీయ చర్చగా మార్చారు. దీంతో బీఆర్ఎస్ మొదట సాధించిన మీడియా అటెన్షన్, ప్రభుత్వంపై వచ్చిన విమర్శల కంటే.. తాతా మధు వ్యాఖ్యలపైనే చర్చ ఎక్కువైంది.

**ఆత్మరక్షణలోకి బీఆర్ఎస్**

ప్రభుత్వంపై దాడి చేయాల్సిన ప్రతిపక్షం.. చివరకు సొంత ఎమ్మెల్సీ వ్యాఖ్యలకు వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి రావడం బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారింది. వివాదం మరింత ముదరకుండా బీఆర్ఎస్ నాయకత్వం వెంటనే నష్టనివారణ చర్యలకు దిగింది.

తాతా మధు తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. తాను స్పీకర్‌ను ఉద్దేశించి మాట్లాడలేదని, పోలీసుల వ్యవహారశైలిపైనే ఆగ్రహం వ్యక్తం చేశానని స్పష్టం చేశారు. తన వ్యాఖ్యల వల్ల ఎవరైనా మనస్తాపం చెంది ఉంటే వాటిని ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు. అయితే అప్పటికే జరగాల్సిన రాజకీయ నష్టం జరిగిపోయిందన్న చర్చ మొదలైంది.

**తాతా మధు ఆవేశమే కారణమా?**

బీఆర్ఎస్‌కు వచ్చిన రాజకీయ అవకాశాన్ని తాతా మధు ఆవేశం దెబ్బతీసిందా? అన్న ప్రశ్న ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీస్తోంది. అసెంబ్లీ తొలిరోజే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్ పక్కా వ్యూహంతో ముందుకు వెళ్లిందని, ప్రారంభంలో ఆ వ్యూహం ఫలించిందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కానీ నిరసన సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్తతలో ఒక నేత చేసిన వ్యాఖ్య మొత్తం రాజకీయ చర్చను మార్చేసిందని అంటున్నారు. రాజకీయాల్లో మాటల విషయంలో అప్రమత్తత ఎంత అవసరమో ఈ ఘటన మరోసారి స్పష్టం చేసిందన్న అభిప్రాయాలున్నాయి.

ప్రతిపక్షంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపేందుకు వచ్చిన బీఆర్ఎస్.. అనూహ్యంగా సొంత నేత వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాల్సిన పరిస్థితికి వెళ్లింది. దీంతో ప్రభుత్వాన్ని టార్గెట్ చేయాల్సిన రోజు.. కొంతసేపు తనను తాను సమర్థించుకునే పరిస్థితి ఏర్పడింది.

**వివాదానికి చెక్ పెట్టే ప్రయత్నం**

వివాదం మరింత విస్తరించకుండా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జోక్యం చేసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. తాతా మధుతో వివరణ ఇప్పించడం ద్వారా పార్టీకి మరింత నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు కనిపించింది.

బీఆర్ఎస్ అసలు లక్ష్యం ప్రభుత్వంపై పోరాటమేనని, వ్యక్తిగత వ్యాఖ్యలతో రాజకీయ పోరాటాన్ని పక్కదారి పట్టించకూడదన్న సంకేతాలు పార్టీ నుంచి వెలువడ్డాయి. అయితే అప్పటికే కాంగ్రెస్ ఈ అంశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది.

**తొలిరోజు అడ్వాంటేజ్ ఎవరిది?**

అసెంబ్లీ సమావేశాల తొలి రోజు పరిణామాలను మొత్తంగా చూస్తే.. ప్రారంభంలో బీఆర్ఎస్‌కు వచ్చిన అడ్వాంటేజ్ చివరకు కాంగ్రెస్‌కు కలిసొచ్చిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నల్లచొక్కాలు, ప్లకార్డులు, పోలీసులతో తోపులాటతో బీఆర్ఎస్ తొలుత ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టింది. మీడియా ఫోకస్‌ను తన వైపు తిప్పుకుంది. అయితే తాతా మధు వ్యాఖ్యలతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. కాంగ్రెస్ అదే అంశాన్ని పట్టుకుని ఎదురుదాడికి దిగింది. బీఆర్ఎస్‌ను డిఫెన్స్‌లోకి నెట్టింది. అంటే.. పొలిటికల్ గేమ్‌లో తొలి ఎత్తు బీఆర్ఎస్‌ది అయినా.. దానికి కౌంటర్ ఎత్తుతో కాంగ్రెస్ పైచేయి సాధించిందన్న మాట.

అసెంబ్లీ సమావేశాలు ఇంకా కొనసాగనున్న నేపథ్యంలో.. ఈ ఘటన తర్వాత బీఆర్ఎస్ ఎలాంటి వ్యూహంతో ముందుకు వెళ్తుంది? కాంగ్రెస్‌ను తిరిగి డిఫెన్స్‌లోకి తీసుకురాగలదా? లేక తొలిరోజు జరిగిన పరిణామాల ప్రభావం మరికొంతకాలం కొనసాగుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# పోలీసులు, పాలకపక్షానికి ఎదురుదెబ్బ

**ముద్ర, హైదరాబాద్ :**

తెలంగాణ శాసనసభ ఆవరణలో ఇటీవల చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులు, సభాధ్యక్షుడిపై అనుచిత వ్యాఖ్యలు, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడి చేశారనే ఆరోపణలతో అరెస్టైన ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో పోలీసులు దాఖలు చేసిన రిమాండ్ అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. అసెంబ్లీ పరిసరాల్లో జరిగిన ఘర్షణలకు సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు నవీన్ కుమార్ రెడ్డి లను పోలీసులు అదుపులోకి తీసుకుని నాంపల్లి కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ ఘటనపై ఇరువర్గాల వాదనలను విన్న న్యాయమూర్తి, పోలీసుల రిక్వెస్ట్‌ను తోసిపుచ్చారు. నిందితులు ఇద్దరూ రూ.10,000 చొప్పున వ్యక్తిగత పూచీకత్తుతో రెండు చొప్పున షూరిటీలను సమర్పించాలని ఆదేశిస్తూ, వారిని తక్షణమే విడుదల చేయాలని స్పష్టం చేశారు. అయితే, అసెంబ్లీ ఆవరణ ఘటనలో అధికార పక్షానికి, పోలీసు శాఖకు ఊహించని దెబ్బ.




# కేసీఆర్ పై హత్యాయత్నానికి కుట్ర!

**ముద్ర హైదరాబాద్ :**

మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై హత్యాయత్నానికి కుట్ర జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజా సమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని, ఈ అంశంపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు.

కేసీఆర్ ఫాంహౌస్‌ను ముట్టడించేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పంపడం ఏ సంస్కారమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అణచివేత చర్యలకు బీఆర్ఎస్ భయపడబోదని అన్నారు. తమ నాయకుడు కేసీఆర్‌ను కాపాడుకునేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు.

ఎర్రవల్లి ఘటన నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై సమగ్ర చర్చకు ప్రభుత్వం సిద్ధం కావాలని డిమాండ్ చేశారు.




# అర్హతలేని టీచర్ల నియామకం చెల్లదు

**ముద్ర, ఢిల్లీ :**

దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. విద్యావ్యవస్థలో నాణ్యతను కాపాడేందుకు అర్హత లేని వ్యక్తులను టీచర్లుగా నియమించకూడదని స్పష్టం చేసింది. RTE, NCTE, UGC నిబంధనల ప్రకారం నిర్దేశించిన అర్హతలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని వారిని కొత్తగా నియమించడం మాత్రమే కాకుండా.. ఇప్పటికే సర్వీసులో ఉన్న వారిని కూడా కొనసాగించడానికి వీల్లేదని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఉపాధ్యాయుల నియామకాల్లో విద్యార్థుల ప్రయోజనాలు, బోధనా ప్రమాణాలకు ప్రాధాన్యతివ్వాలని పేర్కొంది. ప్రభుత్వ సర్వీసుల్లోకి ఉపాధ్యాయులను విలీనం చేసే పేరుతో పారదర్శకమైన, పోటీతత్వ నియామక ప్రక్రియను పక్కన పెట్టడంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సందర్భంగా సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. ఎలాంటి పారదర్శక నియామక ప్రక్రియ లేకుండా.. అర్హతలు లేని వ్యక్తులను ప్రభుత్వ సర్వీసుల్లోకి తీసుకోవడాన్ని అంగీకరించబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. RTE, NCTE, UGC నిబంధనలకు అనుగుణంగా అర్హతలు ఉన్నవారినే ఉపాధ్యాయులుగా నియమించాలని పేర్కొంది. అర్హత ప్రమాణాలను పాటించకుండా నియామకాలు చేపడితే విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని కోర్టు అభిప్రాయపడింది.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 9.09.2026
www.mudranews.in | @mudranews



జుట్టు రాలుతోందా?
హెయిర్ పార్టింగ్ వెడల్పవుతోందా? మధ్యలో జుట్టు విడదీసినప్పుడు స్కాల్ప్ ఎక్కువగా కనిపిస్తే హెయిర్ థిన్నింగ్‌కు ప్రారంభ సూచన కావచ్చు.


## ప్రభుత్వ విధానాలకు ప్రజలకు మధ్య పీఐబీ వారధి



**ముద్ర, అహ్మదాబాద్:** కేంద్ర ప్రభుత్వ విధానాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంతో పాటు క్షేత్రస్థాయి అభిప్రాయాలను ప్రభుత్వానికి చేరవేయడంలో పీఐబీ ద్విముఖ వారధిగా పనిచేస్తోందని పీఐబీ అహ్మదాబాద్ ఏడీజీ శ్రీ సిద్ధార్థ్ బోడ్కే అన్నారు. గుజరాత్ పర్యటనలో ఉన్న హైదరాబాద్ పీఐబీ ఆధ్వర్యంలోని 10 మంది సభ్యుల తెలంగాణ మీడియా ప్రతినిధుల బృందానికి అహ్మదాబాద్ లో నిర్వహించిన బ్రీఫింగ్ లో ఆయన మాట్లాడారు. పర్యటనలో భాగంగా బృందం చారిత్రక కొచ్ రాబ్ ఆశ్రమం, సీఈపీటీ విశ్వవిద్యాలయం, నేషనల్ హై స్పీడ్ రైల్ కార్పొరేషన్ కార్యాలయం, సబర్మతి హై-స్పీడ్ రైల్ మల్టీమోడల్ హబ్ ను సందర్శించింది. సీఈపీటీ విశ్వవిద్యాలయంలో పట్టణ ప్రణాళిక, రవాణా వ్యవస్థలు, సుస్థిర అభివృద్ధి, వాస్తుశిల్పంపై అధ్యాపకులతో చర్చించారు. అనంతరం సబర్మతి మల్టీమోడల్ హబ్ ను పరిశీలించిన మీడియా బృందానికి ముంబయి–అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు పురోగతిని అధికారులు వివరించారు. హైస్పీడ్ రైల్ ను భారతీయ రైల్వేలు, మెట్రో, బీఆర్ టీఎస్ తో అనుసంధానించేలా హబ్ ను రూపొందించినట్లు తెలిపారు.

## అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. కాంగ్రెస్ భారీ నిరసన

**- ఎంఎల్సీ తాతా మధు దిష్టిబొమ్మ దహనం**

**ముద్ర, బోడుప్పల్:** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత, అహంకారపూరిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. బోడుప్పల్ డివిజన్–11 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో, చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుల భాగస్వామ్యంతో బోడుప్పల్ అంబేద్కర్ విగ్రహం వద్ద. బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరై, రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత ఖండనీయమని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బి–బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్, చెంగిచెర్ల మాజీ కార్పొరేటర్లు, కాంటెస్ట్ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.అలాగే సీనియర్ కాంగ్రెస్ నాయకులు విశ్వం గుప్తా , మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్మక్ అజయ్ , మేడ్చల్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర రాహుల్ యాదవ్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అసర్ల బీరప్ప, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బద్దుల శ్రీకాంత్, మైనారిటీ మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సమత యాదవ్, మహిళా కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని తమ నిరసనను తెలియజేశారు.

## అసెంబ్లీ ఆవరణలో విషాదం.. సీపీఆర్ చేసిన మంత్రి.. అయినా పీఎస్ మృతి



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ పర్సనల్ సెక్రటరీ (పీఎస్) రాజు అకస్మాత్తుగా కుప్పకూలారు. గుండెపోటు తో అస్వస్థతకు గురైన ఆయనకు మంత్రి వాకిటి శ్రీహరి వెంటనే స్పందించి సీపీఆర్ చేసి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం అసెంబ్లీ వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే పల్స్ పూర్తిగా పడిపోవడంతో చికిత్స ఫలించలేదని, రాజు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని తెలిసింది.

## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్‌ను సద్వినియోగం చేసుకోండి

**- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్–2026'ను యువ ఫిలిం మేకర్స్ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్ రెడ్డిలతో కలిసి ఛాలెంజ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. షార్ట్‌ఫిలింలు, పాటలు, వీడియోల ద్వారా యువత తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ ఛాలెంజ్ మంచి వేదికగా నిలుస్తుందన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలతో పాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సృజనాత్మకంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇది దోహదపడు తుందని తెలిపారు. యువ ఫిలిం మేకర్స్, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఛాలెంజ్‌ను విజయవంతం చేయాలని మంత్రి కోరారు.

# 'అన్నది నా తల్లిని - నీ తల్లిని కాదు'

**హరీశ్ రావుపై స్పీకర్ ప్రసాద్ కుమార్ ఫైర్**
**హరీశ్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్**
**ఆవేశం తనకు ఉండాలని స్పీకర్ భావోద్వేగం**
**మీ తల్లిని అనలేదు, నా తల్లిని అన్నారంటూ ఆవేదన**
**స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను పరామర్శించిన సీఎం, డిప్యూటీ సీఎం**



**ముద్ర, హైదరాబాద్ :** మాజీ మంత్రి హరీశ్‌రావుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లిపై చేసిన వ్యాఖ్యలకు హరీశ్‌రావు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. అన్నది తన తల్లినని, హరీశ్రావు తల్లిని కాదని వ్యాఖ్యానించారు. ఆవేశం తనకు ఉండాలని, బీఆర్ఎస్ నేతలకు కాదని హితవు పలికారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై జరిగిన దాడికి సంబంధించి నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు మాజీ మంత్రి హరీశ్ రావు ఆవేశంతో మాట్లాడారు. తమ ఎమ్మెల్యేలు సబిత, సునీతలపై జరిగిన దాడికి ఇంకా చర్యలు తీసుకోలేదని అన్నారు. ముగ్గురు బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై కేసు పెట్టారని పేర్కొన్నారు. గౌరవ సభ కౌరవసభగా మారిందని మండిపడ్డారు.

**భావోద్వేగానికి గురైన స్పీకర్**

దీంతో స్పందించిన స్పీకర్ ప్రసాద్ కుమార్ మహిళా సభ్యులంటే సభతో పాటు తనకు కూడా గౌరవం అన్నారు. మీరు చెబితే నేను వినట్లేదా? తాను మాట్లాడుతుంటే మీకు ఎందుకంత ఆవేశమని హరీశ్‌రావును స్పీకర్ ప్రశ్నించారు. "మీకు కాదు ఆవేశం నాకు ఉండాలి. మీ తల్లిని అనలేదు, నా తల్లిని అన్నారు" అని భావోద్వేగానికి గురయ్యారు. సబితా ఇంద్రారెడ్డి, సునీత, కోవా లక్ష్మి పట్ల తనకు గౌరవం ఉందని స్పీకర్ అన్నారు. వారికి జరిగిన అసౌకర్యానికి నివేదిక కావాలని ఆదేశించినట్లు తెలిపారు. రిపోర్టు రాగానే దానికి సంబంధించిన చర్యలు తీసుకుంటామని హరీశ్ రావుకు సమాధానం ఇచ్చారు.

**స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను పరామర్శించిన సీఎం, డిప్యూటీ సీఎం**

స్పీకర్ ఛాంబర్‌లో గడ్డం ప్రసాద్‌ను సీఎం, డిప్యూటీ సీఎం పరామర్శించారు. నిన్న అసెంబ్లీ ఎదుట జరిగిన పరిణామాల దృష్ట్యా స్పీకర్‌ను కలిశారు. స్పీకర్‌ను ఓదార్చిన సీఎం రేవంత్‌రెడ్డి, నిన్నటి ఘటనలపై విచారం వ్యక్తం చేశారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

## కేసీఆర్ సభకు వచ్చి క్షమాపణ చెప్పాలి: స్పీకర్

**ముద్ర, హైదరాబాద్:** సభా సంప్రదాయాలను గౌరవిస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి హాజరై క్షమాపణ చెప్పాలని శాసనసభ స్పీకర్ అన్నారు. ప్రతి సమావేశాల సందర్భంగా కేసీఆర్‌కు ఫోన్ చేసి మాట్లాడుతున్నానని, ఈసారి కూడా ఫోన్ చేయగా ఆరోగ్యం సహకరిస్తే సభకు వస్తానని చెప్పారని తెలిపారు. నిన్నటి ఘటనపై హరీశ్‌రావు క్షమాపణ చెబుతారని భావించానని, కేటీఆర్, హరీశ్‌రావు, నవీన్‌రావు కొట్టిన ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అవసరమైతే సభ్యత్వాల రద్దుకు తీర్మానం చేసి మండలికి పంపే అధికారం తనకు ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. కాగా, కడియం శ్రీహరిని ప్యానల్ స్పీకర్‌గా చేసి చైర్మన్ కుర్చీలో కూర్చోబెట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

## మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

**ముద్ర, హైదరాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు ఆ పార్టీ స్క్రిప్ట్‌లో భాగమేనని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. వ్యూహం రూపొందించి తాతా మధును పంపించారని విమర్శించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా విఫలమయ్యారని, ఆయన కంటే సీఎం రేవంత్‌రెడ్డికి సామాజిక స్పృహ ఎక్కువగా ఉందన్నారు. దళితులకు కాంగ్రెస్‌లో అత్యున్నత పదవులు కల్పించామని పేర్కొన్నారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు పూర్తయిందని, ఖమ్మం–నల్గొండ–వరంగల్, హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ నియోజకవర్గాలకు నాలుగు పేర్ల చొప్పున పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో అభ్యర్థుల పేర్లు ఖరారయ్యే అవకాశం ఉందన్నారు. 22ఏ అంశాన్ని సమూలంగా సమీక్షించి సవరించాలని సీఎం భావిస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. మంత్రి కావాలని తాను ఎప్పుడూ కోరుకోలేదని స్పష్టం చేశారు.

## ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులు పెంచుతాం

**తెలంగాణ ప్రభుత్వం తరుపున చర్యలు - మంత్రి ఉత్తమ్**

**ముద్ర, న్యూఢిల్లీ :** ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతులను పెంచడంతోపాటు ఇరు ప్రాంతాల మధ్య వాణిజ్యాన్ని విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టు లారెల్ జూనియర్‌తో ఆయన సమావేశమై బియ్యం, విత్తనాలు, మాంస ఉత్పత్తుల ఎగుమతులపై చర్చించారు.

తెలంగాణలో నాణ్యమైన బియ్యాన్ని భారీ స్థాయిలో సరఫరా చేసే సామర్థ్యం, ఆధునిక రైస్ మిల్లింగ్ వ్యవస్థ ఉందని ఉత్తమ్ వివరించారు. తెలంగాణ నుంచి బియ్యం దిగుమతులపై లారెల్ సానుకూలంగా స్పందిస్తూ, మరింత పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. బియ్యం ధరలు, నాణ్యత, రవాణా, ధ్రువీకరణ, శానిటరీ–ఫైటోశానిటరీ నిబంధనలపై కూడా చర్చించారు.తెలంగాణ విత్తనాలు, మాంస ఉత్పత్తుల కొనుగోలుపైనా లారెల్ ఆసక్తి వ్యక్తం చేశారు. డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు రావాల్సిందిగా ఉత్తమ్ ఆయనను ఆహ్వానించారు. రైతులు, రైస్ మిల్లర్లు, విత్తన కంపెనీలు, ఆహార పరిశ్రమలకు అంతర్జాతీయ మార్కెట్లు కల్పించడమే లక్ష్యమని ఉత్తమ్ పేర్కొన్నారు.



## కలియుగ దుశ్శాసనుడు రేవంత్ రెడ్డి

**గౌరవ సభ కాదు.. కౌరవ సభ**
**జవహర్ నగర్ పోలీసు స్టేషన్ వద్ద మాజీ మంత్రి, బిఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు**
**రేవంత్ ప్రభుత్వంపై ధ్వజం**



**ముద్ర, హైదరాబాద్ :** జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ వద్ద మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, లా అండ్ ఆర్డర్ పూర్తిగా అదుపు తప్పిందని ఆరోపించారు. కేసీఆర్ ఇంటిపై దాడి ఘటనను ఖండిస్తూ సీఎం రేవంత్ రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా ప్రభుత్వం 'డైవర్షన్ పాలిటిక్స్'కు పాల్పడుతోందని హరీశ్ రావు విమర్శించారు. రైతు భరోసా, పింఛన్లు, యూరియా, విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగుల పీఆర్సీ, డీఏ వంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి జరిగిందని ఆరోపిస్తూ, దీనిపై అసెంబ్లీలో చర్చకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకుని సభ్యత్వం రద్దు చేయాలని కోరారు. రాష్ట్రంలో పరిస్థితులపై కేంద్రం, గవర్నర్ జోక్యం చేసుకోవాలని, అవసరమైతే రాష్ట్రపతి పాలన విధించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తుందని, ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

## ఘనంగా ఓయూ 85వ స్నాతకోత్సవం

ముద్ర, హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయం 85వ స్నాతకోత్సవం ఠాగోర్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. గవర్నర్, ఓయూ ఛాన్స్‌లర్ శివ ప్రతాప్ శుక్ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 640 మంది పీహెచ్‌డీ పరిశోధకులకు పట్టాలు, 71 మంది ప్రతిభావంతులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎం. ఎల్లా హాజరయ్యారు. యువత ఉద్యోగాలు కోరేవారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించేవారిగా ఎదగాలని గవర్నర్ పిలుపునిచ్చారు. ఆవిష్కరణలు, పారిశ్రామికత, ఏఐ వినియోగంపై యువత దృష్టి సారించాలని డాక్టర్ ఎల్లా సూచించారు. విశ్వవిద్యాలయ ప్రగతి, పరిశోధన, భవిష్యత్ దిశపై ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం నివేదిక సమర్పించారు.




## డేటా సెంటర్లతో లక్షల ఉద్యోగాలు

**నీటి కొరత లేదు : ఏపీ సీఎం చంద్రబాబు**
**మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి**
**నదుల అనుసంధానంతో భారీ నీటి నిల్వలు**
**టీడీపీకే తొలి ప్రాధాన్యం: లోకేష్**

**ముద్ర, అమరావతి:** రాష్ట్ర స్థూల అభివృద్ధి నియోజకవర్గ స్థాయి అభివృద్ధితో అనుసంధానం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతిలో జరిగిన టీడీపీ లీడర్షిప్ కాంక్లేవ్ లో సుస్థిర అభివృద్ధిపై ఆయన మాట్లాడారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర జీఎస్డీపీ రూ.20.35 లక్షల కోట్లుగా ఉందని, 15–20 రంగాల్లో వృద్ధిని పెంచేలా నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

రాష్ట్రంలో డేటా సెంటర్లు, సాంకేతిక పరిశ్రమల ఏర్పాటుతో లక్షలాది యువతకు ఉపాధి లభిస్తుందని చంద్రబాబు తెలిపారు. గూగుల్ వంటి సంస్థలు రాష్ట్రానికి రావడం గర్వకారణమని, డేటా సెంటర్లకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్', 'వన్ ఫ్యామిలీ–వన్ ఎంట్రప్రెన్యూర్' విధానాలతో అభివృద్ధిని వేగవంతం చేస్తామన్నారు.

రాబోయే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం ప్రకటించారు. నదుల అనుసంధానం ద్వారా 1,250 నుంచి 1,400 టీఎంసీల నీటిని నిల్వ చేసే సామర్థ్యాన్ని పెంచుతామని చెప్పారు. పోలవరం పనులను పుష్కరాలకు ముందే పూర్తి చేస్తామని, భూగర్భ జలాలను పెంచి వ్యవసాయానికి విద్యుత్ సబ్సిడీ భారం తగ్గించడమే లక్ష్యమన్నారు. రహదారులు, పోర్టులు, ఎయిర్ పోర్టుల అభివృద్ధితో ఏపీని దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని పునరుద్ఘాటించారు.




**పార్టీకే తొలి ప్రాధాన్యం: లోకేష్**

టీడీపీ పార్టీయే తమకు సుప్రీం అని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు పార్టీ పదవుల్లో ఉన్నవారిని గౌరవించాలని సూచించారు. పార్టీ ఇచ్చే బాధ్యతలకే తొలి ప్రాధాన్యమని, పార్టీ ఆదేశించిన కార్యక్రమాలను నాయకులందరూ తప్పనిసరిగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. చంద్రబాబు బి–ఫారమ్ ఇవ్వకపోతే ఎవరూ ప్రజా ప్రతినిధులు కాలేరనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
బుధవారం 09.09.2026



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# ప్రాచీన భారతీయ క్రీడలు

భారతీయ ప్రాచీన క్రీడలకు కేంద్రం గౌరవం ఇచ్చి ప్రోత్సహిస్తోంది.. వీటిలో 'మల్లకంబ' తప్ప మిగిలినవన్నీ మార్షల్ ఆర్ట్స్ తరహా క్రీడలే కావడం, పైగా వీటిలో యోగాకు సంబంధించిన అంశాలుండటం విశేషం. కాగా యుద్ధ విద్యల్లోనూ యోగాకు సముచితం స్థానం ఉందని ఈ ప్రాచీన యుద్ధ విద్యల ద్వారా తెలుస్తుండగా.. ఒకప్పుడు భారత్‌కే పరిమితమైన ఈ క్రీడలు ఇప్పుడు విశ్వవ్యాప్తం కావడం భారతీయులుగా గర్వపడాల్సిన విషయం. ఇన్ని ప్రత్యేకతలున్న ఈ యుద్ధ విద్యల గురించి మీరూ తెలుసుకోండి..



## కలరిపయట్టు

ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన యుద్ధ క్రీడగా 'కలరిపయట్టు'ను అభివర్ణిస్తారు. మలయాళంలో 'కలరి' అంటే పాఠశాల లేదా వ్యాయామశాల అని అర్థం. పయట్టు అంటే యుద్ధం, వ్యాయామం. 'కలరిపయట్టు' అంటే యుద్ధ పాఠశాలగా చెప్పొచ్చు. బాడీ, మైండ్ సమన్వయానికి ఉపయోగపడే 'కలరి' ట్రైనింగ్‌లో భాగంగా చట్టమ్(జంపింగ్), ఒట్టం(రన్నింగ్), మరిచిల్(సోమర్ సాల్ట్), అడి(స్ట్రైక్), ఇడి(పంచ్), తడ(డిఫెన్స్), పయట్టు(అసాల్ట్) వంటివి నేర్పిస్తారు. వీటిలో నైపుణ్యం సాధించిన తర్వాతే డాగర్స్, స్వార్డ్స్, బో అండ్ ఆరో, స్పియర్స్, మేస్(గద), వంటి 'వెపన్స్'తో శిక్షణ అందిస్తారు. మొత్తంగా మెయ్ పయట్టు (ఫిజికల్ ట్రైనింగ్), వడి పయట్టు (స్టిక్ కంబాట్), ఆయుధ పయట్టు(వెపన్ కంబాట్), అడితడ(హ్యాండ్ కంబాట్)లో శిక్షణ సాగుతుంది. కేరళలోని కొజికోడ్, తిరువనంతపురం, తెక్కడి, కోచి, మున్నార్‌లో గల పలు ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్స్‌లో విదేశీయులు సైతం 'కలరిపయట్టు'ను నేర్చుకుంటుండటం విశేషం. కాగా కేరళతో పాటు తమిళనాడు, శ్రీలంక, మలేషియాలో ఈ యుద్ధ విద్యల ప్రదర్శనలు కూడా నిర్వహిస్తుంటారు. ఇక 'కలరిపయట్టు' నేపథ్యంలో ఇప్పటికే చాలా సినిమాలు తెరకెక్కగా, బాలీవుడ్‌నటుడు విద్యుత్ జమాల్‌ఈ క్రీడలో సిద్ధహస్తుడు. కాగా తెలుగులో 'మనసారా' సినిమా కూడా ఇదే బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కడం విశేషం.

## మల్లకంబ

ప్రస్తుతం పోల్ జిమ్నాస్టిక్స్‌కు ఆదిగా 'మల్లకంబ'ను చెప్పుకోవచ్చు. 12 శతాబ్దానికి చెందిన ఈ ప్రాచీన కళారూపంలో తాడు లేదా పోల్ సాయంతో జిమ్నాస్టిక్, యోగా పోజ్‌లు పదర్శిస్తారు. ఏరియల్ యోగా చేయడంతో పాటు వుడెన్ పోల్స్‌కు హ్యాంగ్ అవుతూ రెజ్లింగ్ చేయడం ఈ క్రీడ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. 'మల్ల' అంటే రెజ్లింగ్, 'కంబ' అంటే పోల్ అని అర్థం. మన శరీరాన్ని బ్యాలెన్స్ చేయడం, కంట్రోల్ చేయడమే ఇందులో ప్రధానం కాగా.. మల్లకంబ సాధన చేసేవాళ్లు తమ శరీరం మొత్తాన్ని ట్విస్ట్ అండ్ టర్న్ చేస్తారు. ఈ క్రీడ వల్ల మెంటల్ ఎబిలిటీతో పాటు బాడీ ఫిట్‌నెస్ అండ్ స్ట్రెంత్, బ్రీతింగ్ కంట్రోల్, పవర్ ఆఫ్ కాన్సన్‌ట్రేషన్ పెరుగుతాయి. ప్రపంచస్థాయిలో జరిగే ఈ మల్లకంబ పోటీల్లో 15 దేశాలకు చెందిన రెజ్లర్స్ పార్టిసిపేట్ చేస్తున్నారు. తొలిసారి ముంబైలో జరిగిన 'మల్లకంబ వరల్డ్ చాంపియన్' టైటిల్‌ను భారత క్రీడాకారులు సొంతం చేసుకోవడం విశేషం. మల్లకంబ క్రీడకు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రసిద్ధి


మల్లకంబ

## థాంగ్ టా

మణిపూర్ ట్రెడిషనల్ మార్షల్ ఆర్ట్‌గా ప్రసిద్ధి చెందిన 'థాంగ్ టా' క్రీడను కత్తులు, ఈటె లు, బాకులు వంటి వివిధ ఆయుధాలతో ప్ర దర్శిస్తారు. ఈ శిక్షణలో భాగంగా బ్రీతింగ్ మెథడ్స్, మెడిటేషన్స్ పాటు తాంత్రిక్ ప్రాక్టీ స్, స్వార్డ్, స్పియర్ డ్యాన్సెస్, రియల్ ఫైటిం గ్ టెక్నిక్స్ సాధన చేయిస్తారు. ఎన్నో శతా బ్దాల చరిత్ర కలిగిన ఈ క్రీడను యుద్ధ సమ యాల్లో తమ దేశాన్ని కాపాడుకోవడానికి ప్రదర్శించేవారని చరిత్రకారులు చెబుతున్నారు. అంతేకాదు బ్రిటీషర్ల కాలంలోనూ ఎంతోమంది రాజులు 'థాంగ్ టా' పోరాటంతోనే తమ భూభాగాన్ని కాపాడుకునేవారట. కాగా మణిపూర్ సంప్రదాయ నృత్యా లు ఈ మార్షల్ ఆర్ట్స్ నుంచే ఉద్భవించడం విశేషం.



## గట్కా

సిఖ్ మార్షియల్ ఆర్ట్‌గా పేరొందిన ప్రాచీన యుద్ధ విద్య 'గట్కా'ను ప్రపంచానికి పరిచయం చేసింది పంజాబ్‌కు చెందిన సిక్కులు.14వ శతాబ్ధం నుంచి సిక్కులు దీన్ని ప్రాక్టీస్ చేస్తుండగా, మొదట్లో కత్తులతో ప్రదర్శించేవారు. అయితే బ్రిటిషర్ల కాలంలో నిషేధం విధించడంతో.. కత్తులకు బదులుగా కర్రలతో ప్రాక్టీస్ చేయడం మొదలుపెట్టారు. దాంతో గట్కా 'స్టిక్ ఫైటింగ్'గా మారింది. ఇక 2008లో 'గట్కా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' ఏర్పడిన నాటి నుంచి 'గట్కా' ఓ స్పోర్ట్‌గా మారిపోయింది. 2015లో పంజాబ్ ప్రభుత్వం 'స్టేట్ స్పోర్ట్స్ పాలసీ' జాబితాలో ఈ క్రీడను చేర్చింది. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, బిహార్, యూపీ, మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్, జమ్మూ అండ్ కశ్మీర్ రాష్ట్రాలతో పాటు పలు దేశాల్లోనూ గట్కా నేర్పించే అకాడమీలుండగా, కొన్ని అకాడమీల్లో డిప్లామా సర్టిఫికెట్ కోర్సు కూడా అందిస్తున్నారు. యూఎస్, యూకే, కెనడా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా సహా 30 దేశాల్లో ఈ గట్కా కాంపిటీషన్స్ జరుగుతాయి.


గట్కా




## రోనాల్డో ఫిట్ నెస్ సీక్రెట్



పోర్చుగీస్ ఫుట్ బాల్ క్రీడాకారుడు క్రిస్టియానో రోనాల్డో గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.. ఆధునిక ఫుట్ బాల్ క్రీడలో ఇతని మించిన ఆటగాడు మరొకరు లేరు. చూస్తుండగానే గోల్స్ చేస్తాడు. ప్రత్యర్థి గోల్ పోస్ట్ మీద దారుణంగా దాడి చేస్తాడు. బంతిని అత్యంత చాకచక్యంగా గోల్ పోస్ట్‌లోకి పంపిస్తాడు. అందువల్ల ఇతడిని గోల్ కింగ్ అని పిలుస్తుంటారు.

ఆట తీరుతో మాత్రమే కాదు.. శరీర సామర్థ్యం విషయంలో కూడా రోనాల్డో సరికొత్తగా ఉంటాడు. ఎవరైనా సరే వయసు పైబడి పోతుంటే... కచ్చితంగా దానికి సంబంధించిన మార్పులు కనిపిస్తుంటాయి.. కానీ రోనాల్డో మాత్రం అలా కాదు. తాను అత్యంత కఠినమైన డైట్ కొనసాగిస్తూ ఉంటాడు. పొరపాటున కూడా డైట్ స్కిప్ చేయడు. అతని డైట్ చూసుకోవడానికి ప్రఖ్యాతమైన పోషకాహార నిపుణులు ఉంటారు. వారు నిత్యం అతడు తింటున్న ఆహారాన్ని కనిపెట్టుకొని ఉంటారు. అందువల్లే రోనాల్డో ఆ స్థాయిలో ఉంటాడు.

రోనాల్డో ఏం తింటాడు.. ఎలా ఉంటాడు అనే విషయాలు మొన్నటి వరకు బయటకు రాలేదు. అయితే అతడికి చెఫ్ గా వ్యవహరించిన ఒక వ్యక్తి ఇటీవల ఆ విషయాలను బయటపెట్టాడు. ప్రస్తుతం అతడు రోనాల్డ్ దగ్గర పని చేయడం లేదు. అతను చెప్పిన వివరాల ఆధారంగా రోనాల్డో ఏం తింటాడో.. ఎలాంటి కసరతులు చేస్తాడో అందరికీ తెలిసిపోయింది.

ఉదయం లేవగానే రోనాల్డో జిమ్ చేస్తాడు. ఆ తర్వాత తన శరీరాన్ని మరింత పటిష్టం చేసుకునేందుకు పరుగు పెడతాడు. ఆ తర్వాత పచ్చి అవకాడో ను తింటాడు. దాంతోపాటు ఉడకబెట్టిన గుడ్లను తినేస్తాడు. కేవలం ఎగ్ వైట్ మాత్రమే ఆహారంగా తీసుకుంటాడు. ఈ రెండు పూర్తి అయిన తర్వాత చక్కెర కలపని.. కొవ్వు తీసిన పాలతో తయారుచేసిన కాఫీ తాగుతాడు. మధ్యాహ్నం తీసుకునే ఆహారంలో కచ్చితంగా కూరగాయలు ఉండేలా చూసుకుంటాడు. అందులోనే గ్రిల్ చేసిన ఫిష్.. చికెన్ ఉంటాయి. అవన్నీ కూడా క్యాలరీల ప్రకారమే అతడు తింటాడు. ఒక రకంగా చెప్పాలంటే కొలత వేసినట్టు మాత్రమే తింటాడు.

అతడి డైట్ లో మైదాపిండికి అవకాశం లేదు. కనీసం బియ్యం, గోధుమ పిండి కూడా ఉండదు. పాస్తా అసలు తినడు. చివరికి పిజ్జా, బర్గర్లను కూడా ఇష్టపడడు. బ్రెడ్ కూడా ముట్టుకోడు. రాత్రిపూట అతని డైట్ చాలా సింపుల్ గా ఉంటుంది. అధిక మోతాదులో కూరగాయలు.. చికెన్.. ఫిష్ తింటాడు. అవన్నీ కూడా గ్రిల్ అయితేనే తింటాడు. తాగే నీటి విషయంలో కూడా అతడు జాగ్రత్తలు తీసుకుంటాడు. మ్యాచ్ లు ఉంటే తప్ప రాత్రిపూట మెలకువతో ఉండడు.

సాధ్యమైనంతవరకు మద్యానికి దూరంగా ఉంటాడు. అందువల్లే అతడు ఈ స్థాయిలో శరీర సామర్థ్యంతో కనిపిస్తుంటాడు. ఆధునిక కాలంలో వివిధ క్రీడలు ఆడే క్రీడాకారుల్లో.. శరీర సామర్థ్యాన్ని సమర్థవంతంగా కొనసాగించే ఆటగాళ్లలో రోనాల్డో ముందు వరుసలో ఉంటాడు. ఇండియాకు చెందిన క్రికెటర్ విరాట్ కోహ్లీ కూడా ఇలానే శరీర సామర్థ్యాన్ని కొనసాగిస్తూ ఉంటాడు.

## వీళ్లు రియల్ పెద్దిలు

### జాబితాలో ఉన్న ఇండియన్ ప్లేయర్లు ఎవరో తెలుసా

రామ్ చరణ్ హీరోగా రూపొందిన పెద్ది చిత్రం ఇటీవల విడుదలైంది. క్రీడా నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. పెద్ది సినిమాలో రామ్ చరణ్ క్రాస్ అథ్లెట్‌గా నటించాడు. క్రికెటర్, కుస్తీ వీరుడు, పరుగులు పెట్టే వీరుడిగా అతడు త్రిముఖ పాత్రలలో అతడు నటించాడు. ఈనేపథ్యంలో అలాంటి పాత్రలను రియల్ లైఫ్ లో పోషించిన క్రీడాకారుల గురించి ఈకథనంలో తెలుసుకుందాం.

క్రాస్ అథ్లెట్ల గురించి ప్రధానంగా ప్రస్తావిస్తే ఈ జాబితాలో యుజువేంద్ర చాహల్, వీవ్ రిచర్డ్స్, సుజీ బేట్స్, ఎలిస్ ఫెర్రీ, రూడీ వాన్ వూరెన్ ఉన్నారు. వీరంతా మొదట్లో ఒక విభాగంలో ప్రవేశించారు. ఆతర్వాత క్రికెట్ లో సత్తా చూపించారు. తద్వారా మల్టీ స్పోర్ట్స్ పర్సనాలిటీస్ గా పేరు తెచ్చుకున్నారు. అంతే కాదు, ఆ క్రీడల్లో పేరు తెచ్చుకున్నారు. వేలాది మంది అభిమానాన్ని సొంతం చేసుకున్నారు. పెద్ది సినిమా కూడా ఇలాంటి స్పోర్ట్స్ పర్సనాలిటీస్ నేపథ్యాన్ని తీసుకునే రూపొందించినట్టు తెలుస్తోంది.



వెస్టిండీస్ క్రికెట్ ఆటగాడు వీవ్ రిచర్డ్స్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇతడు 1974లో వెస్టిండీస్ లో ఫుట్ బాల్ ఆడేవాడు. వరల్డ్ కప్ లో ప్రాతినిధ్యం వహించాడు. ఆ తర్వాత క్రికెట్ లోకి ప్రవేశించాడు. వెస్టిండీస్ క్రికెట్ జట్టులో తనకంటూ గొప్ప ముద్ర వేసుకున్నాడు. యుజువేంద్ర చాహల్ భారత క్రికెట్ జట్టులోకి ప్రవేశించడానికి ముందు చదరంగంలో సత్తా చూపించాడు. 2003లో ప్రపంచ యూత్ చాంపియన్ షిప్ లో ఆడాడు. ఆ తర్వాత క్రికెట్ లోకి ప్రవేశించాడు. టీమిండియా తరపున తనదైన ముద్ర వేశాడు. ఇప్పటికీ ఐపీఎల్ లో అదరగొడుతున్నాడు.

న్యూజిలాండ్ మహిళా క్రికెట్ జట్టులో కీలక ప్లేయర్ గా పేరుపొందింది సుజీ బేట్స్. ఈమె బాస్కెట్ బాల్ ప్లేయర్. 2008లో ఒలంపిక్స్ లో ఈమె న్యూజిలాండ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించింది. ఆ తర్వాత న్యూజిలాండ్ జాతీయ క్రికెట్ జట్టులో ఆడింది. కివీస్ జట్టులో తనకంటూ ప్రత్యేకమైన ముద్ర వేశాడు. ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టులో కీలక ప్లేయర్ గా పేరుపొందింది ఎలీస్ ఫెర్రీ. ఈమె గతంలో ఆస్ట్రేలియా ఫుట్ బాల్ జట్టులో ప్లేయర్ గా ఆడింది. 2011 ఫిఫా వరల్డ్ కప్ లో ఆసీస్ జట్టు తరఫున ఆడింది. అనంతరం ఆసీస్ క్రికెట్ జట్టులో ప్రవేశించింది. ఆసీస్ జట్టులో తనదైన ముద్ర వేసింది.

నమీబియా క్రికెట్ జట్టులో రూడీ వాన్ వూరెన్ కీలకమైన ఆటగాడిగా గుర్తింపు పొందాడు. 2003 వన్డే వరల్డ్ కప్ టోర్నీలో నమీబియా జట్టు తరఫున ఆడాడు. క్రికెటర్ కంటే ముందు ఇతడు నమీబియా దేశం తరఫున రగ్బీ వరల్డ్ కప్ లో ఆడాడు. అనంతరం నమీబియా క్రికెట్ జట్టులోకి ప్రవేశించాడు. కొంతకాలం నమీబిమయా జట్టులో క్రికెటర్ గా ఆడాడు.

## IPL: ఒక్కో డాట్ బాల్ వెనక..

### బీసీసీఐ పచ్చటి సంకల్పం

### ఇప్పటివరకు ఎన్ని మొక్కలు నాటిందో తెలుసా

ఐపీఎల్ అనగానే మనకు ముందుగా గుర్తొచ్చేది కార్పొరేట్ క్రీడ. కోట్లకు కోట్లు పెట్టి ప్లేయర్లను కార్పొరేట్ కంపెనీలు కొనుగోలు చేస్తాయి. ప్రసార హక్కుల నుంచి మొదలుపెడితే.. జెర్సీల అమ్మకం వరకు ప్రతిదీ కోట్లతోనే ముడిపడి ఉంటుంది. అందువల్లే ఐపిఎల్ ను కార్పొరేట్ క్రీడ అని పిలుస్తుంటారు. దీని వెనక కూడా ఒక గట్టి సంకల్పం దాగింది.

ఐపీఎల్ లో ప్లేయర్లు బీభత్సంగా బ్యాటింగ్ చేస్తుంటారు. పరుగుల వరద పారిస్తూ ఉంటారు. సిక్సర్ల మీద సిక్సర్లు.. ఫోర్ల మీద ఫోర్లు కొడుతూ ఉంటారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. ఐపీఎల్ లో డాట్ బాల్ పడితే.. దానికి ఎటువంటి సార్థకత చేకూర్చాలి అనే చర్చ అప్పట్లో జరిగింది. వాస్తవానికి ఐపీఎల్లో డాట్ బాల్ అంటేనే గొప్ప ఘనత. ఎందుకంటే బంతిని కనపడితే చాలు గట్టిగా కొట్టాలని ప్రతి ఆటగాడు అనుకుంటాడు. అందువల్లే డాట్ బాల్ వేసే బౌలర్లకు గుర్తింపు తీసుకురావాలని ఐపిఎల్ నిర్వాహక కమిటీ అప్పట్లో భావించింది.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో ప్రతి డాట్ బాల్ కు మొక్కలు నాటే కార్యక్రమాన్ని 2023లో ఐపీఎల్ నిర్వాహక కమిటీ మొదలుపెట్టింది. దీని వెనక పిసిసిఐ ఉంది. ముందుగా ప్లే ఆఫ్ లో డాట్ బాల్ కు 500 చొప్పున మొక్కలను నాటాలని నిర్ణయించుకున్నారు. ఆ తర్వాత లీగ్ మ్యాచ్ లకు కూడా దీనిని విస్తరింపజేశారు. ప్రస్తుతం ఐపీఎల్ 19వ సీజన్ నడుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి డాట్ బాల్ కు 19 మొక్కలను బిసిసిఐ నాటుతోంది. ఇప్పటివరకు ప్రత్యేకంగా ప్లాంటేషన్ నర్సరీలు.. క్రికెటింగ్ సౌకర్యాల వద్ద ఆరు లక్షలకు పైగా మొక్కలు నాటింది. టాటా గ్రూపు ఈ హరిత సంకల్పానికి సహకరిస్తుంది. వాస్తవానికి ప్రపంచంలో ప్రీమియర్ లీగ్ లు చాలా వరకు కొనసాగుతున్నాయి. కానీ ఏ యాజమాన్యం కూడా ఇలా మొక్కలు నాటిన చరిత్ర లేదు.

ప్రీమియర్ లీ క్రికెట్ చరిత్రలో బిసిసిఐ మాత్రమే ఈ హరిత సంకల్పానికి శ్రీకారం చుట్టింది. అందువల్లే మొక్కలను ఈ స్థాయిలో నాటుతోంది. ఈ మొక్కల వల్ల పర్యావరణానికి తన వంతుగా సహకారం అందిస్తోంది బీసీసీఐ, టాటా కంపెనీ. మొక్కలను నాటడం మాత్రమే కాదు.. వృక్షాలుగా ఎదిగేందుకు కూడా తోడ్పాటు అందిస్తోంది టాటా కంపెనీ.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 09.09.2026
www.mudranews.in | @mudranews



## జుట్టు రాలుతోందా?

దిండుపై, స్నానం సమయంలో జుట్టు ఎక్కువగా పడుతోందా? అప్పుడప్పుడు జుట్టు రాలడం సహజమే. కానీ వరుసగా కొన్ని వారాల పాటు ఎక్కువగా రాలుతుంటే కారణాన్ని తెలుసుకోవాలి.



# తాతా మధు వ్యాఖ్యలపై భగ్గుమన్న కాంగ్రెస్

**తాతా మధు దిష్టిబొమ్మ దహనం**

**ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్**

**తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి**



**ముద్ర, చేవెళ్ళ:** తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధును పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ చేవెళ్ళ ఇంచార్జి భీమ్ భరత్ డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, ప్రసాద్ కుమార్ పై MLC తాత మధు చేసిన అత్యంత హేయమైన, నీచమైన, కించపరిచే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నిరసనగా మొయినాబాద్ లో కాంగ్రెస్ శ్రేనులు ప్రధాన కూడలిలో రాస్తారోకో నిర్వహించారు.ఇది ఒక వ్యక్తిపై చేసిన దాడి కాదని ఇది రాజ్యాంగంపై దాడి అని, 4 కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవంపై దాడి అని అన్నారు.రాజ్యాంగబద్ధమైన, అత్యున్నత పదవిలో ఉన్న స్పీకర్ పై కించపరిచేలా మాట్లాడటం... సభా ప్రాంగణంలోనే ఇంత నీచానికి దిగజారడం చరిత్రలో చీకటి రోజని భారతదేశ చరిత్రలో ఏ చట్టసభలోనూ ఇలాంటి దుర్మార్గం జరగలేదని అన్నారు.అధికారం పోయిందనే అక్కసుతో, ఓర్వలేక ఇలాంటి పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని ఇది వారి సంస్కారానికి నిదర్శనమన్నారు.MLC తాత మధు వెంటనే బేషరతుగా ప్రజలకు, స్పీకర్ కు క్షమాపణ చెప్పాలని అతన్ని తక్షణమే శాసనమండలి నుండి అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్ మొయినాబాద్ మండలం మాజీ అధ్యక్షులు మానయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సత్య నారాయణ, మొయినాబాద్ మున్సిపల్ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ లు సీనియర్ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు దురదృష్టకరం

**దళిత సంఘాల ఆగ్రహం, పదవి నుంచి బర్తరఫ్‌కు డిమాండ్**

**ముద్ర, కూకట్పల్లి :** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పీఠాన్ని అలంకరించి, సభకు అధ్యక్షత వహిస్తున్న స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడి మాత్రమే కాదని, యావత్ దళిత సమాజ ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయడమేనని దళిత సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.భారత రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులను, స్వేచ్ఛను ప్రసాదించినప్పటికీ, సమాజంలో కొందరి ఆధిపత్య ధోరణులు, అహంభావ ఆలోచనలు ఇంకా రూపుమాసిపోలేదనడానికి ఈ ఘటనే తాజా నిదర్శనమని ప్రజాస్వామ్యవాదులు పేర్కొంటున్నారు. రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవిలో దళిత వర్గానికి చెందిన నాయకుడు కూర్చోవడాన్ని జీర్ణించుకోలేక, కొందరు నేతలు తమలోని వివక్షాపూరిత మనస్తత్వాన్ని బయటపెట్టుకుంటున్నారని విమర్శిస్తున్నారు.తరతరాలుగా సామాజికంగా, రాజకీయంగా అణచివేతకు గురవుతున్న దళిత వర్గాలు చట్టసభల్లో ఉన్నత స్థానాలకు ఎదిగినప్పటికీ, కొందరి ఆలోచనల్లో మార్పు రాకపోవడం విచారకరమని పలువురు నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. మాటల్లో సమానత్వం గురించి చెప్పే నాయకులు, ఆచరణలో మాత్రం కుల వివక్ష భావజాలాన్ని మోస్తున్నారని ఈ ఘటన ద్వారా స్పష్టమవుతోందన్నారు.అహంకారపూరిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధును తక్షణమే పదవి నుండి బర్తరఫ్ చేయాలని దళిత హక్కుల పోరాట సమితులు డిమాండ్ చేస్తున్నాయి. కేవలం పదవి నుంచి తొలగించడమే కాకుండా, రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ కులవివక్షను, వర్ణ ద్వేషాన్ని ప్రోత్సహిస్తున్నందున ఆయనపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతున్నాయి. రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడాలంటే ఇలాంటి వివక్షాపూరిత వ్యాఖ్యలను ఎంతమాత్రం ఉపేక్షించకూడదని, దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నైనా సమాజం తిప్పికొడుతుందని నాయకులు హెచ్చరించారు.

## ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు వయోపరిమితి పెంచాలి

**7 వేల పోస్టులు కాదు.. 20 వేల ఖాళీలను భర్తీ చేయాలి**

**కల్వకుంట్ల కవిత**

**వయోపరిమితి పెంచితే మరో 2–3 లక్షల మంది నిరుద్యోగులకు ప్రయోజనం**



**ముద్ర, హైదరాబాద్:** ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీలో వయోపరిమితిని పెంచాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.

బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి నిరుద్యోగులు కీలకంగా పనిచేశారని కవిత అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలకంటే ఎక్కువగా కష్టపడి నిరుద్యోగులు గ్రామాల్లో తిరిగి ఆ పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు అవుతున్నా ఉద్యోగాల భర్తీ విషయంలో ఆశించిన స్థాయిలో నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని విమర్శించారు.2024లో కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తున్నట్లు ప్రచారం చేసి జీవో నంబర్ 31 విడుదల చేశారని, వయోపరిమితిపై సడలింపు ఇస్తామని చెప్పి రెండేళ్ల సమయం వృథా చేశారని ఆరోపించారు. దీంతో ఎంతోమంది నిరుద్యోగులు వయోపరిమితి దాటి ఉద్యోగాలకు అర్హత కోల్పోయారని అన్నారు.ఎస్ఐకి 38.. కానిస్టేబుల్‌కు 36 ఏళ్లకు పెంచాలిఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు వయోపరిమితిని తప్పనిసరిగా పెంచాలని కవిత డిమాండ్ చేశారు. ఎస్సై ఉద్యోగాలకు 38 ఏళ్లు, కానిస్టేబుల్ ఉద్యోగాలకు 36 ఏళ్ల వరకు వయోపరిమితి పెంచాలని కోరారు. ఈ నిర్ణయం తీసుకుంటే మరో 2 నుంచి 3 లక్షల మంది నిరుద్యోగులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.వయోపరిమితి పెంచకపోవడం వల్లే కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు దరఖాస్తులు భారీగా తగ్గాయని కవిత అన్నారు. సాధారణంగా సుమారు 9 లక్షల దరఖాస్తులు రావాల్సి ఉండగా, ఈసారి 3 నుంచి 4 లక్షల దరఖాస్తులకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు.20 వేల ఖాళీలు ఉంటే.. 7 వేల పోస్టులకే నోటిఫికేషన్?రాష్ట్రంలో సుమారు 20 వేల కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారని కవిత ఆరోపించారు. ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు."హోంశాఖ ఒకటి చెబితే.. ప్రభుత్వం మరొకటి చెబుతోంది. మీలో మీకే సమన్వయం లేదు" అని కవిత విమర్శించారు. వయోపరిమితి పెంచకపోవడంతో వేలాది మంది నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు.వయోపరిమితి పెంపు కోసం పోరాటం చేస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థులకు తెలంగాణ రక్షణ సేన తరపున పూర్తి మద్దతు ఉంటుందని కవిత ప్రకటించారు.

## ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ ధరావతు వాపస్

**ఏ ఖాతా నుంచి చెల్లిస్తే.. అదే ఖాతాకు తిరిగి చెల్లింపు**

**నాలుగు నియోజకవర్గాల్లో దరఖాస్తులకు రేపే ఆఖరు**

**హౌసింగ్ బోర్డు వైస్‌చైర్మన్ వి.పి.గౌతం**

**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబరు 8:** ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో లాటరీలో ఎంపిక కాని దరఖాస్తుదారులు చెల్లించిన రూ.10 వేల ధరావతు (ఈఎండీ) మొత్తాన్ని తిరిగి చెల్లించే ప్రక్రియ ప్రారంభమైందని హౌసింగ్ బోర్డు వైస్‌చైర్మన్ వి.పి. గౌతం తెలిపారు. దరఖాస్తు సమయంలో మీ సేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో స్వీకరించిన ఈఎండీని.. ఏ ఖాతా నుంచి చెల్లించారో అదే ఖాతాకు జమ చేస్తున్నామని చెప్పారు.ప్రత్యేకంగా ఎలాంటి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, వారం రోజుల్లో ఈ రిఫండ్ ప్రక్రియ పూర్తవుతుందని వెల్లడించారు. అయితే కొందరు నగదు రూపంలో లేదా ఇతరుల ఖాతాల నుంచి ఈఎండీ చెల్లించినట్లు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. అలాంటి వారు తమకు నేరుగా మొత్తం జమ అయ్యేలా హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ tghb.telangana.gov.in ద్వారా సెప్టెంబరు 10లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గడువులోగా దరఖాస్తు చేయకపోతే, ఏ ఖాతా నుంచి చెల్లింపు జరిగిందో అదే ఖాతాకు మొత్తం తిరిగి జమ అవుతుందని స్పష్టం చేశారు.కొనసాగుతున్న వెరిఫికేషన్.. కార్యాలయాల చుట్టూ తిరగొద్దుఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌లో లాటరీ ద్వారా ఎంపికైన వారి వివరాల పరిశీలన కొనసాగుతోందని గౌతం తెలిపారు. వెరిఫికేషన్ పూర్తయిన అనంతరం అర్హులకు ఇళ్ల కేటాయింపు పత్రాలు అందజేస్తామని చెప్పారు. ప్రతిపాదించిన 7,340 ఇళ్లకు వెయిటింగ్ లిస్ట్‌తో కలిపి సుమారు 10 వేల మందిని లాటరీ ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు.దరఖాస్తుదారులు సమర్పించిన వివరాల వాస్తవికతను క్షేత్రస్థాయిలో నిర్ధారించేందుకే వెరిఫికేషన్ చేపడుతున్నామని, ఎంపికైన వారు అధికారులకు సహకరించాలని కోరారు. లబ్ధిదారులు చెల్లించాల్సిన మొత్తం, ఏ ఖాతాలో ఎలా చెల్లించాలనే వివరాలను అలాట్‌మెంట్ లెటర్‌లో పొందుపరుస్తామని చెప్పారు.ఇళ్లకు సంబంధించిన సమాచారం కోసం హౌసింగ్ బోర్డు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, వాట్సాప్, ఎస్ఎంఎస్ ద్వారా అవసరమైన సమాచారాన్ని అందిస్తున్నామని తెలిపారు. సందేహాలుంటే 040–24603572 కాల్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు.నాలుగు నియోజకవరాల్లో రేపే గడువుఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో తొలుత 16 నియోజకవర్గాల నుంచి దరఖాస్తులు స్వీకరించి, లాటరీ ప్రక్రియను పూర్తి చేశారు. మరో నాలుగు నియోజకవర్గాల్లో ప్రస్తుతం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. చాంద్రాయణగుట్ట, ఎల్.బి.నగర్, ముషీరాబాద్, గోషామహల్ నియోజకవర్గాల పరిధిలో నిర్మించనున్న టవర్స్‌లో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబరు 10 చివరి తేదీ అని గౌతం తెలిపారు. ఆయా నియోజకవర్గాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రజలను దగా చేసిన కాంగ్రెస్ సర్కార్

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** హామీలు కాదు–అమలు కావాలి..6 గ్యారంటీలు, 420 హామీలతో గద్దెనెక్కి తెలంగాణా ప్రజలను కాంగ్రెస్ సర్కార్ దగా చేసిందని బి ఆర్ ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర ప్రజలకు వంద రోజుల్లో స్వర్గం అని, వెయ్యి రోజుల నరకం చూపించిన ఈ కాంగ్రెస్ పాలన పోవాలని, బి ఆర్ ఎస్ ప్రభుత్వం వస్తేనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. గతంలో కే సీ ఆర్ అమలు చేసిన పథకాలు జాతీయ స్థాయిలో దేశాన్ని ఆకర్శించయని, రైతు బీమా, రైతు భరోసా, పంటలకు 24గంటల విద్యుత్,గ్రామపంచాయతీ లకు నిధులు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరద,అమ్మవడి, కే సీ ఆర్ కిట్స్, కంటివెలుగు, టి –హబ్,గొర్రెల పంపిణీ, చేపపిల్లల పంపిణీ, షీ టీమ్ లతో మహిళలకు రక్షణ ఇవన్నీ ఏమై పోయాయి అని ప్రశ్నించారు. ప్రస్తుతం తెలంగాణా కాంగ్రెస్ పాలన లో అవినీతి పెరిగింది, సంక్షేమం ఆగిపోయింది.. ప్రస్తుతం రాష్ట్రం లో 'దోచుకో దాచుకో' పాలన నడుస్తుందని ప్రజలు అన్నీ గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ కు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని,వచ్చేది బీ ఆర్ ఎస్ ప్రభుత్వమే అని, తప్పకుండా కే సీ ఆరే మళ్ళీ సీ ఎం అవుతారని వ్యాఖ్యానించారు..

## క్రీడాకారులకు ఉచిత శిక్షణ

**ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యార్థులకు పూర్తి ఫీజు మినహాయింపు**

**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబరు 8:** క్రీడా శిక్షణను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్పష్టం చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఉచిత శిక్షణ కొనసాగుతుందని తెలిపింది. స్పోర్ట్స్ అథారిటీ కేంద్రాల్లో శిక్షణ పొందుతున్న వారిలో 42 శాతానికి పైగా మందికి ఉచిత కోచింగ్, క్రీడా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించింది. వార్షిక ట్యూషన్ ఫీజు రూ.35 వేల వరకు ఉన్న ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కూడా ఉచిత శిక్షణకు అర్హులని తెలిపింది.14 ఏళ్ల అనంతరం క్రీడా శిక్షణ ఫీజులను సవరించామని, స్టేడియాలు, మైదానాల నిర్వహణ, క్రీడా పరికరాలు, కోచ్‌ల పారితోషికాలు, విద్యుత్, భద్రత వ్యయాలు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని అథారిటీ వివరించింది. విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఉచిత శిక్షణ కల్పించే విధానాన్ని కూడా కొత్త ఉత్తర్వుల్లో ప్రవేశపెట్టినట్లు పేర్కొంది. ఫీజుల క్రీడాకారులు, తల్లిదండ్రుల నుంచి వచ్చిన సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సవరించిన ఫీజుల నిర్మాణాన్ని సమగ్రంగా పరిశీలించి, అవసరమైన హేతుబద్ధీకరణకు సిఫార్సులు చేసేందుకు కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు స్పోర్ట్స్ అథారిటీ తెలిపింది. ఎల్బీ స్టేడియంలో సోమవారం స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ కె. శివసేనారెడ్డి, వైస్‌చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డా. ఎ. సోనిబాలాదేవి ఆధ్వర్యంలో స్టేడియాల నిర్వాహకులు, కోచ్‌లు, డిప్యూటీ డైరెక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. క్రీడాకారుల సంక్షేమమే స్పోర్ట్స్ అథారిటీకి అత్యున్నత ప్రాధాన్యమని తెలిపారు. గుర్తింపు పొందిన పోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి, అంతకంటే ఉన్నత స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులకు సంబంధిత క్రీడా విభా గాల్లో ఆ క్యాలెండర్ సంవత్సరంలో ఉచిత శిక్షణ, ప్రాక్టీస్ సదుపాయాలు కొనసాగుతాయని వివరించారు. కేవీబీఆర్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న వారిలో 57 శాతం, జింఖానా మైదానంలో 65, హుస్సేన్‌సాగర్ వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్‌లో 88, ఉస్మానియా యూనివర్సిటీ సైక్లింగ్ వెలో డ్రోమ్‌లో 57, ఎల్బీ స్టేడియంలో 42, జీఎంసీ బాలయోగి స్టేడియంలో 35 శాతం మందికి ఉచిత కోచింగ్ లభించనుంది. కయాకింగ్, కానోయింగ్‌లో శిక్షణ పొందుతున్న వారందరికీ ఉచిత శిక్షణ అందనుంది. నాణ్యమైన శిక్షణ, క్రీడాకారుల సంక్షేమం, మౌలిక వసతుల బలోపేతమే లక్ష్యాలని తెలిపారు.

## స్పీకర్ పై బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలు బాధాకరం

**తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకురాలు సూరారపు కృష్ణవేణి**



**ముద్ర, హైదరాబాద్ :** అసెంబ్లీ సమావేశాల తొలి రోజునే సభ ఆవరణలో జరిగిన సంఘటనలు జుగుప్సాకరంగా ఉన్నాయని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకురాలు సురారపు కృష్ణవేణి ఆవేదన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ ను అవమానించేలా బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలను తెలంగాణ రక్షణ సేన తీవ్రంగా ఖండిస్తోందన్నారు. స్వాతంత్రం వచ్చి 80 ఏళ్లైనా దళితులు ఎంత ఉన్నత పదవుల్లో ఉన్నా వారిపట్ల వివక్షపూరిత ధోరణి చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్ పై బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ మహిళ శాసన సభ్యులపై పోలీసులు వ్యవహరించిన తీరు దుర్మార్గంగా ఉందన్నారు. ఈ సంఘటనకు బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలకు వేదిక కావాల్సిన శాసన సభ ఔచిత్యాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీలు దెబ్బ తీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పై వివక్ష పోవాలంటే సామాజిక న్యాయ తెలంగాణతోనే సాకారమవుతుందన్నారు. సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం తమ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల కవిత సంకల్పం తీసుకొని పోరాడుతున్నారని తెలిపారు.

## బీసీ శ్మశాన వాటికల సమస్యలపై మున్సిపల్ కార్యాలయం ముట్టడి




**ముద్ర ప్రతినిధి, తాండూర్:** బిసి శ్మశాన వాటికల్లో ప్రత్యేక డ్రైవ్నిర్వహించిపేరుకు పోయిన చెత్తను తొలగించి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని నియోజకవర్గ బిసి కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ డిమాండ్. మంగళవారం రోజున రాజ్ కుమార్ ఆధ్వర్యంలో బీసీ స్మశాన వాటిక దుస్థితిపై మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. మునిసిపల్ కమిషనర్ కు, మున్సిపల్ చైర్ పర్సన్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ బిసి స్మశాన వాటికలో ముళ్ళ పొదలను, చెట్లను తొలగించి అవసరమైన మౌలిక వసతులు కల్పించి త్వరితగతిన అభివృద్ధి చేయాలని బీసీ సంఘం నాయకులు పేర్కొన్నారు.ఈ డిమాండ్‌పై మున్సిపల్ చైర్‌పర్సన్, పట్లోళ్ల నీరజా బాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డిలు సానుకూలంగా స్పందించి, వెంటనే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి శ్మశాన వాటికలను పరిశుభ్రంగా మారుస్తామని హామీ ఇచ్చారుఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండలాల అధ్యక్షులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌ను అవమానించింది కాంగ్రెస్ నేతలే

**తాతా మధు స్పీకర్‌ను, ఆయన తల్లిని ఎక్కడా దూషించలేదు**

**ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**

**దళితుడనే గుర్తింపుతో పదేపదే ప్రస్తావించడమే అవమానమని వ్యాఖ్య**



**ముద్ర, హైదరాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను గానీ, ఆయన తల్లిని గానీ ఎక్కడా దూషించలేదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. "స్పీకర్ గారూ.. మీ అమ్మగారు, మా అమ్మగారు వేరు కాదు. మా అమ్మపై ఎంత గౌరవం ఉందో.. మీ అమ్మపై కూడా అంతే గౌరవం ఉంది. స్పీకర్ పదవిపై కూడా మాకు అంతే గౌరవం ఉంది" అని ఆయన అన్నారు.అయితే స్పీకర్‌ను నిజంగా అవమానిస్తున్నది కాంగ్రెస్ నాయకులేనని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ప్రతిసారీ ఆయనను "దళిత.. దళిత" అంటూ ప్రత్యేకంగా ప్రస్తావించడం ద్వారా అవమానిస్తున్నారని విమర్శించారు.ముఖ్యమంత్రి నుంచి సీతక్క, శ్రీధర్‌బాబు వరకు, తాజాగా లకారంతో మాట్లాడిన ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ వరకు పలువురు కాంగ్రెస్ నేతలు స్పీకర్‌ను దళితుడనే గుర్తింపుతో ప్రస్తావిస్తున్నారని అన్నారు. ఒక వ్యక్తి రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నప్పుడు ఆయన సామాజిక వర్గాన్ని పదేపదే ప్రస్తావించడం ద్వారా ఆ పదవిని, వ్యక్తిని తక్కువ చేసి చూపుతున్నారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు."తాతా మధు స్పీకర్ గారిని ఒక్క మాట కూడా అనలేదు. ఆయన అమ్మగారిని దూషించలేదు. కానీ స్పీకర్‌ను దళితుడిగా పదేపదే గుర్తుచేయడం ద్వారా కాంగ్రెస్ నేతలే ఆయనను అవమానిస్తున్నారు" అని ఆయన పేర్కొన్నారు.

డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లో శిశువు మృతదేహం లభ్యం: కెపిహెచ్‌బిలో ఘటనముద్ర కూకట్పల్లి :కెపిహెచ్‌బి కాలనీ పరిధిలోని బాలాజీనగర్ డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లో మంగళవారం ఒక నవజాత శిశువు మృతదేహం కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం ఈ విధంగా ఉన్నాయి.బాలాజీనగర్ సెక్షన్ (కూకట్‌పల్లి సర్కిల్) పరిధిలోని డిఆర్సి కాలనీ, హెచ్.నెంబర్ 14 వద్ద మురుగునీరు పొంగిపొర్లుతోందని సెప్టెంబర్ 7న జలమండలికి ఫిర్యాదు (టోకెన్ నంబర్: 3220) అందింది. ఈ ఫిర్యాదు ఆధారంగా సెప్టెంబర్ 8న జలమండలి సిబ్బంది సమస్యను పరిష్కరించడానికి ఘటనా స్థలానికి చేరుకున్నారు.హెచ్ ఐ జి –14 మరియు లోటస్ హాస్పిటల్ సందులోని మ్యాన్‌హోల్ చాంబర్‌ను తెరిచి పూడిక తీస్తుండగా, అందులో ఒక పసిపాప మృతదేహం కనిపించింది. దీంతో వెంటనే జలమండలి మేనేజర్ వై. సునీత స్థానిక కెపిహెచ్‌బి పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు ఆధారంగా కెపిహెచ్‌బి పోలీసులు బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 194 కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## అవినీతి పాలనపై మా పోరాటం ఆగదు

**-బోడుప్పల్ లో బీఆర్ఎస్ ధర్నా**



**ముద్ర, బోడుప్పల్:** కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తమ పోరాటం ఆగదని జెడ్ పీటీసీ మాజీ సభ్యుడు, బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు. మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ మంత్రి మల్లారెడ్డిలపై, ఇతర ఎంఎల్ఏలపై పోలీసుల దౌర్జన్యం, అరెస్ట్ లకు నిరసనగా మంగళవారం ఉదయం బోడుప్పల్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం ఊరేగింపుగా బోడుప్పల్ మునిసిపల్ కార్యాలయానికి చేసుకుని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ అక్కడి అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్, రామచంద్ర రెడ్డి, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 9.09.2026
www.mudranews.in | @mudranews



### జుట్టు రాలుతోందా?

జుట్టు రాలడంతో పాటు స్కాల్ప్ సమస్యలున్నాయా? దురద, నొప్పి, ఎర్రబడటం, కొన్ని చోట్ల మాత్రమే జుట్టు తగ్గడం లేదా అకస్మాత్తుగా అధిక హెయిర్ ఫాల్ ఉంటే డెర్మటాలజిస్ట్‌ను సంప్రదించడం మంచిది.



## భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తే ఊరుకోం

**-టీయుడబ్ల్యూజే ప్రదర్శనలో ముక్తకంఠంతో హెచ్చరించిన జర్నలిస్టులు**







**ముద్ర, హైదరాబాద్:** దేశంలో భావాప్రకటన స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని, మీడియా స్వేచ్ఛను హరించేందుకు పాలకులు ప్రయత్నిస్తే ప్రజాస్వామికావాదుల నుండి ప్రతిఘటన తప్పదని జర్నలిస్టులు హెచ్చరించారు. ఢిల్లీలో విధినిర్వహణలో ఉన్న మహిళా జర్నలిస్టులపై పోలీసుల దాడి, అక్రమ కేసు, అరెస్టును నిరసిస్తూ మంగళవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయుడబ్ల్యూజే) ఆధ్వర్యంలో జర్నలిస్టులు, ప్రజాస్వామికావాదులు కొవ్వొత్తులతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. బషీర్ బాగ్ లోని టీయుడబ్ల్యూజే కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ నిరసన ప్రదర్శన, నిజాంకాలేజీ మీదుగా జగజీవన్ రాం విగ్రహం వరకు కొనసాగింది. అనంతరం టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు సీనియర్ పాత్రికేయులు, ప్రజాస్వామికవాదులు ప్రసంగించారు.

ప్రజాస్వామిక ఈ దేశంలో పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, స్వేచ్ఛను ఖునీ చేస్తూ, తమకు అనుకూలమైన విధానాలను ఎన్డియే ప్రభుత్వం అవలంబించడం అప్రజాస్వామికమని సీనియర్ పాత్రికేయులు, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్ ఆందోళన వ్యక్తం చేసారు. ఐదు రోజుల క్రితం ఢిల్లీలో విధినిర్వహణ లో ఉన్న మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన మహిళా జర్నలిస్టులు షాహిన్ ఖాన్, నఫీజా ఖాన్ లపై పోలీసులు దాడి చేయడం, వారిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను, జర్నలిస్టుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఈ సభలో పాల్గొన్న పలువురు సూచించారు. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, అక్రమ అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు అన్నారు. మహిళా జర్నలిస్టులకు న్యాయం చేయడంతో పాటు, ఘటనకు బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ. మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరి సత్యనారాయణ, కె. అజిత, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షురాలు అత్తలూరి అరుణ, టీయుడబ్ల్యూజే మహిళా జర్నలిస్ట్స్ విభాగం కన్వీనర్ రాజేశ్వరీ, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు సంధ్య, సీనియర్ పాత్రికేయులు వనజ, స్వప్న, విమల, టీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రాజేష్, బి. కిరణ్ కుమార్, హెచ్.యు.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, తెలంగాణ చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, తెలంగాణ ఉర్దూ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్ మోహియొద్దీన్ లతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ఉచిత శిక్షణ

**ముద్ర, హైదరాబాద్ :** ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులతో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులకు ఉచిత శిక్షణ కొనసాగుతుందని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (SATG) తెలిపింది. సవరించిన ఫీజులపై సమీక్షకు కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించింది. కొత్త విధానం ప్రకారం 42 శాతానికి పైగా క్రీడాకారులకు ఉచిత కోచింగ్, సదుపాయాలు అందనున్నాయని పేర్కొంది. ఆర్థిక పరిస్థితులు క్రీడా ప్రతిభకు అడ్డంకి కాకూడదని SATG ఛైర్మన్ కె. శివసేనారెడ్డి తెలిపారు.

## కూరగాయలు, పండ్లతోటల సాగు విస్తరణకు కార్యాచరణ ప్రణాళిక

**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్రంలో కూరగాయలు, పండ్లతోటలు, తృణధాన్యాలు, ప్రత్యామ్నాయ పంటల సాగును విస్తరించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ మేరకు సూచనలు చేశారు. రైతులకు అధిక ఆదాయం అందించే కూరగాయల సాగును ప్రోత్సహించడంతో పాటు, ఆయా పంటలకు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి సాగు విస్తీర్ణాన్ని పెంచాలని సీఎస్ సూచించారు. రైతులకు సాంకేతిక సహకారం, ఆర్థిక వనరులు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు నాబార్డ్‌తో పాటు సంబంధిత సంస్థల సహకారాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి వనరులను పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందని, కూరగాయలు, పండ్లతోటలు, ప్రత్యామ్నాయ పంటల్లో డ్రిప్ ఇరిగేషన్‌ను విస్తృతంగా ప్రోత్సహించాలని సంజయ్ జాజు సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలతో పాటు వ్యవసాయ, వెటర్నరీ విశ్వవిద్యాలయాలు సమన్వయంతో పనిచేసి రైతులకు మెరుగైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించాలని ఆదేశించారు.

## జన ఔషధి కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి

**- ఈటల రాజేందర్**

**ముద్ర, న్యూఢిల్లీ :** జన ఔషధి కేంద్రాల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి, ప్రజలకు నాణ్యమైన మందులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. జన ఔషధి కేంద్రాల సమస్యలపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. మందుల సరఫరాదారులకు ప్రస్తుతం 3–6 నెలల వరకు చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయని, ఇకపై సరఫరా చేసిన 30–45 రోజుల్లోపు బిల్లులు చెల్లించేలా స్పష్టమైన గడువు నిర్ణయించాలని సూచించారు. అదే విధంగా కేంద్రాల్లో అవసరమైన మందులు ఎప్పుడూ అందుబాటులో ఉండేందుకు కనీస నిల్వ ప్రమాణాలు ఏర్పాటు చేయాలని కోరారు. తక్కువ ధరతో పాటు మందుల లభ్యత, అందుబాటు ధర, నాణ్యతకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని రాజేందర్ పేర్కొన్నారు. ప్రతి బ్యాచ్‌కు కఠినమైన నాణ్యత పరీక్షలు నిర్వహించాలని, నాణ్యతపై ఫిర్యాదులు వస్తే వేగంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మందుల సరఫరా వ్యవస్థను వేగవంతం చేయడంతో పాటు, క్యాన్సర్ మందుల లభ్యతను విస్తరించాలని సూచించారు. అధిక డిమాండ్ ఉన్న మధుమేహం, రక్తపోటు, గుండె, థైరాయిడ్ తదితర వ్యాధుల మందులను డిమాండ్ ఆధారంగా ముందుగానే నిల్వ చేయాలని తెలిపారు. గడువు ముగిసిన లేదా గడువు సమీపిస్తున్న మందులను తిరిగి తీసుకునే స్పష్టమైన విధానం ఉండాలని, దీనివల్ల జన ఔషధి కేంద్రాల నిర్వాహకులు ఆర్థికంగా నష్టపోకుండా చూడాలని కోరారు. సమీపంలోని ఇతర కేంద్రాల్లో మందుల నిల్వ వివరాలు తెలుసుకునేలా డిజిటల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఫిర్యాదుల పరిష్కారానికి ఏకీకృత వ్యవస్థ, కేంద్రాలకు సమయానుకూల మార్జిన్లు, గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేక సహాయం, స్థానిక డిమాండ్‌కు అనుగుణంగా మందుల జాబితా విస్తరణ, సరఫరా వైఫల్యాలకు బాధ్యత నిర్ధారణ వంటి అంశాలపై చర్యలు తీసుకోవాలని ఈటల రాజేందర్ కోరారు.

## దళితుల ఆత్మగౌరవమే మా ప్రధాన లక్ష్యం



**ముద్ర చిగురుమామిడి :** బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాత మధు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై చేసిన అసభ్యకరమైన, అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, బీజేపీ దళిత మోర్చా మండల అధ్యక్షులు దొంత కర్ణకర్ ఆధ్వర్యంలో చిగురుమామిడి మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా దొంత కర్ణకర్ మాట్లాడుతూ, దళితుల పట్ల బీఆర్ఎస్ నాయకులకు మొదటి నుంచీ చులకన భావన కొనసాగుతోందని, ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నత గౌరవం కలిగిన అసెంబ్లీ స్పీకర్ పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్ గారిపై ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం దళిత సమాజాన్ని అవమానించడమేనని అన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే ఎలాంటి వ్యాఖ్యలను, చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు. దళిత సమాజం ఐక్యంగా నిలబడి, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి, ఆ పార్టీ నాయకులకు ప్రజాస్వామ్య పద్ధతిలో తగిన రాజకీయ సమాధానం చెబుతుందని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మాశం సదికుమార్, బి. రాజమౌళి, జెల్ల సంపత్, తాడెం శ్రీనివాస్, దొంత సదానందం, కొర్రి సదానందం, జె. రాజు, జంగ రాజు, బొలుమల్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**ముద్ర, కరీంనగర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపిస్తూ తెలంగాణ రక్షణ సమితి ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ కూడలిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులతో ఆందోళన చేశారు. విద్యార్థులకు రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యువతకు రూ. 4 వేల నిరుద్యోగ భృతి, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ. 2500 ఇవ్వాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు అందించాలన్నారు.



## మహిళా పోలీసులపై అవమానకర ప్రవర్తన సిగ్గుచేటు

**- పద్మావతి రెడ్డి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 8:** మహిళా పోలీసులపై బీఆర్ఎస్ సభ్యుల అనుచిత ప్రవర్తన సభ్యసమాజానికే సిగ్గుచేటని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. శాసనసభాపతి గౌరవాన్ని కాపాడటం పార్టీలకు అతీతంగా ప్రతి సభ్యుడి బాధ్యత అని పేర్కొన్నారు. మైక్‌లో రికార్డు కాలేదనే కారణంతో హేయమైన వ్యాఖ్యలను ఉపేక్షించరాదన్నారు. మహిళా పోలీసులపై అవమానకరంగా ప్రవర్తించిన వారితో పాటు సభాపతి, మహిళా ప్రజాప్రతినిధులు, సీఎం, మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సభాపతిని కోరారు. మహిళా ఎమ్మెల్యేలంతా కలిసి ఈ ఘటనపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## చెట్టును ఢీకొన్న కారు.. యువకుడి దుర్మరణం

**ముద్ర, జగిత్యాల న్యూస్:** జగిత్యాల గ్రామీణ మండలం కల్లెడ సమీపంలో సోమవారం కారు చెట్టుకు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా.. ముగ్గురు గాయపడ్డారు. జగిత్యాల రూరల్ పోలీసుల కథనం మేరకు.. యాదాద్రి జిల్లా గుండాల మండలానికి చెందిన శివరాత్రి మహేశ్(23) పెగడపల్లి మండల కేంద్రంలో నివాసం ఉంటూ బండపని చేస్తున్నారు. స్నేహితులైన మంచిర్యాల జిల్లా దండేపల్లిలో ఉండే దొంతమల్ల వెంకటేశ్, సురేందర్‌లతో కలిసి జగిత్యాలకు కారులో బయలు దేరారు. మార్గమధ్యలో మహేశ్వరి అనే యువతిని ధర్మపురిలో ఎక్కించుకున్నారు. కల్లెడ సమీపంలో కారు అదుపుతప్పి చెట్టుకు బలంగా ఢీకొట్టడంతో నుజ్జునుజ్జు అయింది. ప్రమాదంలో మహేశ్ అక్కడికక్కడే మృతి చెందగా మహేశ్వరి, సురేందర్, వెంకటేశ్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని జగిత్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న జగిత్యాల రూరల్ ఎస్సై ఉమాసాగర్ మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

**ముద్ర, పెద్దపల్లి న్యూస్:** మానసిక వికలాంగురాలిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ఎలిగేడు మండలం లాలపల్లికి చెందిన న్యాతరి రామయ్య(47)కు పెద్దపల్లి జిల్లా కోర్టు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధించింది. అలాగే బాధితురాలికి రూ.4 లక్షల పరిహారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆదేశించింది.

## కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ : ఆందోళనల బాట



### బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో

**ముద్ర, కరీంనగర్ :** ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిని పోలీసులు అరెస్టు చేయడానికి నిరసిస్తూ కరీంనగర్ బీఆర్ఎస్ మహిళలు ఆందోళన చేపట్టారు. కోర్టు కూడలి చౌరస్తాలో రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. దీంతో అరగంట పాటు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాస్తారోకో చేస్తున్న కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులను ఆపాలని వారు డిమాండ్ చేశారు.



### స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలి

అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ నేతలు అనుసరించిన తీరును ఖండిస్తూ కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన చేపట్టారు. కోర్టు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నేతల తీరుపై అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్పీకర్ ముందు క్షమాపణ చెప్పాలని సుడా మాజీ ఛైర్మన్ నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పకపోతే బీఆర్ఎస్ నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామన్నారు.

## రద్దీతో కరీంనగర్ బస్టాండ్‌లో ఆందోళన చేసిన ప్రయాణికులు

**ముద్ర, కరీంనగర్ :** శ్రావణ మాసం చివరి మంగళవారం కావడంతో వేములవాడ, కొండగట్టుకు వెళ్లిన భక్తులు తిరుగు ముఖం పట్టడంతో కరీంనగర్ బస్టాండ్‌లో అనూహ్యంగా రద్దీ పెరిగింది. సరిపడ బస్సులు లేకపోవడంతో అసహనానికి గురైన ప్రయాణికులు విచారణ కౌంటర్ వద్దకు వెళ్లి సిబ్బందిని నిలదీశారు. పలు రూట్లలో, ముఖ్యంగా వరంగల్ రూట్‌లో బస్సులు లేకపోవడంతో ఒకదశలో ప్రయాణికులు బస్టాండ్‌లో బైఠాయించి బస్సులు వెళ్లకుండా అడ్డుకున్నారు. రద్దీ విషయమై కరీంనగర్–1 డిపో మేనేజర్ విజయ మాచురి దృష్టికి తీసుకెళ్లగా గంటలో 11 అదనపు బస్సులను వరంగల్ రూట్‌లో నడిపినట్లు చెప్పారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు.



## వినాయక ఉత్సవాలు సోదరభావంతో జరుపుకోవాలి

**-చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్**

**ముద్ర చిగురుమామిడి :** వినాయక చవితి ఉత్సవాలను అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా, సోదరభావంతో, ప్రశాంతంగా జరుపుకోవాలని చిగురుమామిడి ఎస్సై పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం శాంతి కమిటీ సమావేశాన్ని ఎస్సై ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నుండి వివిధ కులాల, మతాల పెద్దలు, యువకులుయూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటు విషయంలో నిర్వాహకులు పోలీసు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మండపాల వల్ల రహదారులపై ట్రాఫిక్ కు, సామాన్య ప్రజలకు, అంబులెన్స్ ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. డీజే సౌండ్ ల విషయంలో నిబంధనలు పాటించాలని, రాత్రి వేళల్లో అధిక శబ్దం చేయరాదని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ, తప్పుడు వార్తలు, ఇతర మతాలను కించపరిచే విధంగా పోస్టులు పెట్టినా, వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వర్డ్ చేసినా అలాంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై గట్టిగా హెచ్చరించారు. ఎక్కడైనా ఏదైనా చిన్న గొడవ జరిగినా, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రజలంతా పోలీసులకు సహకరించి చిగురుమామిడి మండలంలో వినాయక చవితి వేడుకలను విజయవంతం చేయాలని ఎస్సై కోరారు. అత్యవసర సహాయం కోసం డయల్ 112 లేదా ఎస్సై నెంబర్ 8712670772 ను సంప్రదించాలన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 09.09.2026
www.mudranews.in | @mudranews



**జుట్టు రాలుతోందా?**
హెయిర్‌లైన్ వెనక్కి వెళ్తోందా? నుదురు పక్కల నుంచి హెయిర్‌లైన్ నెమ్మదిగా వెనక్కి వెళ్లడం లేదా తల పైభాగంలో జుట్టు పలుచబడడాన్ని గమనించాలి.



# స్పీకర్‌పై వ్యాఖ్యలు.. కాంగ్రెస్ నిరసన ప్రదర్శనలు

**దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే సహించేది లేదు**
**ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**





**ముద్ర, తుర్కపల్లి:** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ తుర్కపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ రాస్తారోకో నిర్వహించాయి. ప్రధాన చౌరస్తాలో జరిగిన నిరసనకు ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. స్పీకర్‌ను అవమానించడం అంటే ఒక వ్యక్తిని మాత్రమే కాదు.. శాసనసభను, రాజ్యాంగ వ్యవస్థను, ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని అన్నారు.దళిత సమాజానికి చెందిన వ్యక్తి శాసనసభ స్పీకర్‌గా ఉన్నతమైన రాజ్యాంగ పదవిలో కొనసాగుతున్న సమయంలో ఆయనను ఉద్దేశించి వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ముఖ్యంగా స్పీకర్ తల్లిని ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలు దళితుల ఆత్మగౌరవాన్ని కించ పరిచేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.“దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఏ చర్యనూ కాంగ్రెస్ సహించదు. దళితుల గౌరవం కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నాం” అని ఐలయ్య స్పష్టం చేశారు.బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి శాసనమండలి సభ్యత్వాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఐలయ్య విమర్శించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, ప్రతి దళిత కుటుంబానికి మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని ఆరోపించారు. ఇప్పుడు అదే పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు దళిత సమాజానికి చెందిన స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం వారి వైఖరికి నిదర్శనమన్నారు.తెలంగాణ ఉద్యమంలో దళితుల పాత్ర కీలకమైందని, దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం దళితుల గౌరవానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఎర్రబెల్లి ఫామ్‌హౌస్ ముట్టడికి బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణులురాస్తారోకో సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. డప్పులతో నిరసన వ్యక్తం చేస్తూ దళితుల ఆత్మ గౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మాజీ సీఎం కేసీఆర్‌కు చెందిన ఎర్రబెల్లి ఫామ్‌హౌస్ ముట్టడికి బయలుదేరారు.కార్యక్రమంలో మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ధనావత్ శంకర్‌నాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ఎనగండ్ల సుధాకర్, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ వాణి భరత్‌గౌడ్, కాంగ్రెస్ సర్పంచులు, ఎనిమిది మండలాల పార్టీ అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాతా మధు దిష్టిబొమ్మ దహనం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 8 :** స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై శాసనమండలి సభ్యులు తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుండి పాత బస్టాండ్ సెంటర్ వరకు సాగిన ఈ ర్యాలీ అనంతరం తాతా మధుసూదన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా, రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడం దళిత జాతిని తీవ్రంగా గాయపరిచిందని ఎస్ సీ సెల్ జిల్లా అధ్యక్షులు బొడ్డు బొందయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా మాట్లాడిన తాతా మధుసూదన్ శాసనమండలి సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత పాటించాలి

**ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్**



**ముద్ర, తుర్కపల్లి :** తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న కార్యక్రమం తీరును, అధికారులు నిర్వహిస్తున్న రికార్డులను ఆయన పరిశీలించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా నోటీసులు అందుకున్న అభ్యర్థులకు సంబంధించిన డాక్యుమెంటేషన్, హియరింగ్, హాజరు ప్రక్రియలను అధికా రులు పూర్తి చేసిన తీరును అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. ఎలాంటి నో మ్యాపింగ్ సమస్యలు రాకుండా ప్రక్రియను నిర్వహించిన బీఎల్‌ఓలను ఆయన అభినందించారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ వెంకారెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి తప్పులు లేకుండా అవసరమైన సవరణలు చేపట్టాలని ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటు హక్కును పొందేలా అధికారులు అవగాహన కల్పించాలని అన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు, వివరాల విషయంలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి నరేష్, బీఎల్‌ఓలు నారా భాగ్య, పలుగుల సరిత, కారోబార్ దుడుక బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను చెల్లించాలి




**ముద్ర, మోత్కూర్:** గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఆర్ టి ఎఫ్ (ఫీజు రీయాంబర్స్మెంట్) బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఫీజు రియంబర్స్మెంట్ చేయకుండా ప్రభుత్వం అవలంభిస్తున్న మొండి వైఖరికి నిరసనగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, పీజీ కళాశాలల ఆర్ టి ఎఫ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కళాశాలల నిరసన కార్యక్రమములో భాగంగా కళాశాలలు బంద్ చేయడం జరిగిందనీ మహాత్మ గాంధీ యూనివర్సిటీ ప్రైవేటు డిగ్రీ, పిజి కళాశాలల సెక్రటరీ సి హెచ్ సత్యం గౌడ్ అన్నారు. మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని సంతోష్ డిగ్రీ కళాశాలను మూసివేసి అనంతరం ఆయన మాట్లాడుతూ పది వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని గత వారం రోజుల నుండి వివిధ రూపాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టిన ప్రభుత్వం పట్టింపు లేదని కళాశాలలు బంద్ చేయడం జరిగిందనీ తెలిపారు. ఇప్పటికైన ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేసి అమరని రహర దీక్ష చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జనగాం మారమ్మ భౌతికకాయానికి నివాళి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, తుక్కాపురం గ్రామ సర్పంచ్ జనగాం పాండు మాతృమూర్తి, తుక్కాపురం మాజీ ఎంపీటీసీ జనగాం మారమ్మ అకాల మరణం పట్ల పార్టీ శ్రేణులు దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశాయి. మారమ్మ పార్థివ దేహాన్ని మాజీ శాసనసభ్యులు పైళ్ళ శేఖర్ రెడ్డి, పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి సందర్శించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ గాఢ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ జడల అమరేందర్ గౌడ్, కొలుపుల అమరేందర్ లతో పాటు నియోజకవర్గానికి చెందిన సర్పంచ్‌లు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ సింగిల్ విండో చైర్మన్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు జిల్లా మరియు మండల స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని అంతిమయాత్ర, అంత్యక్రియలలో భాగస్వాములయ్యారు.

## కొండమల్లేపల్లి గ్రామంలోశ్రీ కృష్ణ భగవానుడిని ఊరేగింపు



**ముద్ర, దేవరకొండ:** త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పాలేరు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణుడి ప్రతిమ ను శ్రీ కొండమల్లేపల్లి గ్రామంలో ఊరేగింపు పుర వీధులలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమం లో త్రైత సిద్ధాంత–ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కొండమల్లేపల్లి ఉత్సవ నిర్వాహకులు, నల్గొండ కమిటీ అధ్యక్షులు, సభ్యులు పగిడి మర్రి వెంకటేశం , మేకల శ్రీనివాసులు, రంగారెడ్డి, పరమేష్,అశోక్ , కమలాకర్ , నరసింహ, గిరి, తిరుమలేష్ సైదులు, శ్రీను, వెంకటమ్మ ,కవిత, పార్వతమ్మ సరిత,తదితర సభ్యులు పాల్గొన్నారు.

# నీటి సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

**దోసపహాడ్ ప్రాజెక్టు పునరుద్ధరణకు ప్రతిపాదనలు**
**మిషన్ భగీరథ లోపాలపై సమీక్ష**
**ట్యాంకర్లతో ప్రత్యామ్నాయ సరఫరా**
**పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం**
**కొత్త మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం.. కలెక్టరేట్‌కు కనెక్టివిటీ రోడ్డుపై కీలక నిర్ణయం**
**మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి**



**ముద్ర, సూర్యాపేట:**పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు.మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా జరుగుతున్నప్పటికీ విద్యుత్ అంతరాయం, మోటార్ల మరమ్మతులు, పైపులైన్ లీకేజీలతో అప్పుడప్పుడు సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. భవిష్యత్‌లో ఇబ్బందులు లేకుండా గతంలో వినియోగంలో ఉన్న దోసపహాడ్ ప్రాజెక్టును పునరుద్ధరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. మిషన్ భగీరథ అధికారులతో ఫీల్డ్ విజిట్ నిర్వహించి సమస్యలను గుర్తించామని తెలిపారు. ప్రస్తుతం 9–10 వాటర్ ట్యాంకులను నింపి వివిధ వార్డులకు నీటిని సరఫరా చేస్తున్నామని, అంతరాయం ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి మాట్లాడుతూ బోర్లు ఎండిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో నీటి సమస్య ఏర్పడిందన్నారు. మూసీ అధికారులతో మాట్లాడి సద్దుల చెరువును నింపినట్లు తెలిపారు. దీనివల్ల పరిసర వార్డుల్లో బోర్లకు కొంతమేర నీరు అందుతోందన్నారు. ప్రజాప్రతినిధుల ఫోన్ కాల్స్‌కు అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా స్పందించాలని, నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కార్మికుల సంక్షేమానికి నిర్ణయాలుపారిశుద్ధ్య కార్మికులకు ఏటా అందించే సబ్బులు, దుస్తులు, కొబ్బరి నూనె తదితర సంక్షేమ సామగ్రి పంపిణీకి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అలాగే నాలుగేళ్ల తొమ్మిది నెలలుగా పీఎఫ్ చెల్లింపులు పెండింగ్‌లో ఉన్న 120 మంది కార్మికుల మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించారు.కొత్త మాస్టర్ ప్లాన్‌కు ఆమోదంసూర్యాపేట పట్టణ సమగ్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రూపొందించిన కొత్త మాస్టర్ ప్లాన్‌కు జనరల్ బాడీ ఆమోదం తెలిపింది. పట్టణ విస్తరణ, రహదారులు, మౌలిక వసతులకు అనుగుణంగా ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు.అలాగే జాతీయ రహదారి–65 కింద ఉన్న 60 అడుగుల రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు అనుసంధాన రహదారి ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అందించాలని నిర్ణయించారు. ఈ రహదారి పూర్తయితే కలెక్టరేట్‌కు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ ఎండీ షఫీఉల్లా, ఫ్లోర్ లీడర్లు కుమ్మరికుంట్ల వేణు, అంగిరేకుల నాగార్జున, కౌన్సిలర్లు డాక్టర్ వి. రామమూర్తి, కొండపల్లి దిలీప్‌రెడ్డి, గండూరి రమేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగుల హక్కుల సాధనకు కదలిరండి



**ముద్ర, తుర్కపల్లి:** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న “చలో హైదరాబాద్ – హక్కుల సాధన మహాసభ”ను విజయవంతం చేయాలని టీజీఈ జేఏసీ సెక్రటరీ జనరల్ ధరణికోట భరత్ పిలుపునిచ్చారు. మంగళవారం తుర్కపల్లి మండలంలో ప్రచార కార్యక్రమం నిర్వహించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గోడపత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ 2వ పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న 6 డీఏల విడుదల, ఉద్యోగులు–పెన్షనర్లకు పూర్తిస్థాయి నగదు రహిత వైద్యం, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు, పెండింగ్ బిల్లుల విడుదల, జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.టీఎన్జీవో సెక్రెటరీ ఎండీ ఖాదిర్ మాట్లాడుతూ జీవో 190ను అన్ని శాఖల్లో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ఖాళీ పోస్టుల భర్తీ, పదోన్నతులు, బదిలీల్లో పారదర్శకత పాటించాలని కోరారు.ఎంపీడీవో లెంకల గీతారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు కోరుతున్నవి ఉచితాలు, కానుకలు కాదని, వారి సేవలకు నిబంధనల ప్రకారం దక్కాల్సిన హక్కులేనని అన్నారు. సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో జరిగే సభకు తుర్కపల్లి మండలం నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధికారులు, కార్మికులు, పెన్షనర్లు అధిక సంఖ్యలో తరలివచ్చి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## వేంసూరులో బీఆర్ఎస్ భారీ ర్యాలీ



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 8 :** అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దాడికి నిరసనగా బీఆర్ఎస్ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేపట్టాయి. మర్లపాడు పార్టీ కార్యాలయం నుంచి వేంసూరు వరకు నల్ల జెండాలతో సాగిన ఈ ర్యాలీలో మహిళలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలను అసెంబ్లీలో చర్చకు రాకుండా చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని విమర్శించారు. తమ పార్టీకి శాసనసభ స్పీకర్ పదవి పట్ల పూర్తి గౌరవం ఉందని స్పష్టం చేస్తూ, పార్లమెంట్‌లో నల్ల దుస్తులతో నిరసన తెలిపిన కాంగ్రెస్ నేతలు, తెలంగాణలో బీఆర్ఎస్ నేతల నిరసనలను అడ్డుకోవడం వారి ద్వంద్వ విధానాలకు నిదర్శనమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థిక సాయం, రైతు భరోసా, తులానికి బంగారం వంటి అన్ని హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, హామీల అమలు కోసం బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేస్తూ, అనంతరం వివిధ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

## బాల్య వివాహాలను అడ్డుకోకపోతే కఠిన చర్యలు: సీపీ సునీల్ దత్

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 8 :**
బాల్య వివాహాలను అరికట్టేందుకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందని, ఈ అనాచారానికి పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ స్పష్టం చేశారు. చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేయడం వల్ల బాలల భవిష్యత్తు, చదువు, ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. సమాజంలో ఎవరూ కూడా ఇటువంటి వివాహాలను ప్రోత్సహించకూడదని సూచించారు. బాల్య వివాహాలు జరిపించే వారు, వారికి సహకరించే వారు, ప్రోత్సహించే ప్రతి ఒక్కరిపై చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు.ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా సకాలంలో అందిన సమాచారంతో పోలీసులు స్పందించి ఎనిమిది బాల్య వివాహాలను నిలిపివేసినట్లు సీపీ తెలిపారు. కూసుమంచి పరిధిలోని బోటిమీడి తండా, తల్లాడ మండలం అన్నారుగూడెం, వైరా మండలం తాటిపూడి, సత్తుపల్లి పరిధిలోని బేతుపల్లి, కామేపల్లి మండలం బాసిత్ నగర్, బోనకల్ మండలం పెద్దబీరవల్లి, వైరా మండలం గన్నవరం, ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ వివాహాలను అడ్డుకున్నామన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటివరకు 12 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సమాజం నుంచి బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు, సంబంధిత శాఖల అధికారులు పోలీస్ శాఖతో చేతులు కలపాలని పోలీస్ కమిషనర్ కోరారు.

## శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న బుల్లెట్ సైలెన్సర్ల ధ్వంసం



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం , సెప్టెంబరు 8 :**
శబ్ద కాలుష్యాన్ని సృష్టిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న బుల్లెట్ ద్విచక్ర వాహనాల సైలెన్సర్లపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నట్లు అడిషనల్ డీసీపీ రామానుజం తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అమర్చిన, అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్న బుల్లెట్ సైలెన్సర్లను పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. వాహనదారులు తమ ద్విచక్ర వాహనాలకు కంపెనీ నిర్దేశించిన ఒరిజినల్ సైలెన్సర్లనే వినియోగించాలని, అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను అమర్చుకుని ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా అధిక శబ్దంతో వాహనాలు నడపడం, నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లను మార్చడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రజల ప్రశాంతత, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శబ్ద కాలుష్య నియంత్రణకు పోలీసుల చర్యలు కొనసాగుతాయని ఈ సందర్భంగా తెలిపారు.గతంలో 1654 బుల్లెట్ సైలెన్సర్లను తొలగించగా ప్రస్తుతం 4 వందలు ధ్వంసం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 09.09.2026
www.mudranews.in | @mudranews



**జుట్టు రాలుతోందా?**
దువ్వెనలో ఎక్కువ జుట్టు కనిపిస్తోందా? కొన్ని వారాల పాటు సాధారణం కంటే ఎక్కువ జుట్టు రాలితే నిర్లక్ష్యం చేయకుండా కారణాన్ని గమనించాలి.



## ఎస్ఐఆర్ గడువు పొడిగింపు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూల్‌ను సవరించినట్లు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు.ప్రజలకు మరింత అవకాశం కల్పించేందుకు క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలు గడువును అక్టోబర్ 7 వరకు పొడిగించినట్లు వెల్లడించారు.

## అక్రమ డిప్యూటేషన్లను నిలిపివేయాలి

**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో మెదక్ జిల్లాలో ఉపాధ్యాయులను డిఈఓ ఇష్టానుసారంగా మండలాలు దాటి కోరిన స్థానాలను కేటాయిస్తున్నారని డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ కు టీఆర్టిఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రణీద్ కుమార్ వినతిపత్రం అందజేశారు. నిబంధనలను విరుద్ధంగా ఇది పూర్తిగా ప్రభుత్వ విధివిధానాలకు వ్యతిరేకమైన చర్య అన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు చేయడం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విధి విధానాలను ఖరారు చేస్తూ జిఓ 25 ను విడుదల చేయడం జరిగిందని గుర్తు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన సర్దుబాటు ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బి. ఐలయ్య, నాయకులు మల్లేశంలు పాల్గొన్నారు.

# ధాన్యం గోదాముల నిర్మాణానికి స్థల పరిశీలన చేయాలి

**అదనపు కలెక్టర్ నగేష్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:**వానాకాలం ధాన్యం సీజన్-2026 ను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ నగేష్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో సివిల్ సప్లై, వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన గోదాముల నిర్మాణాల కోసం అనువైన స్థలాలను పరిశీలించాలని సంబంధిత ఆర్డీఓలు, తహసిల్దారులను ఆదేశించారు జిల్లాలో ధాన్యం దిగుబడికి అనుగుణంగా నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వ స్థలాలు, వ్యవసాయ మార్కెట్ యార్డులు తదితర ప్రాంతాల్లో స్థలాలను గుర్తించి పరిశీలన చేయాలన్నారు.గోదాముల నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, రవాణా సౌకర్యాలు, రైతులకు అందుబాటులో ఉండే విధంగా స్థలాల ఎంపికపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. అక్టోబర్ మొదటి వారంలో జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని, రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేలా విస్తృత అవగాహన కల్పించలన్నారు.కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, తూకం యంత్రాలు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, ధాన్యం నాణ్యత పరీక్షించే పరికరాలు తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు పారదర్శకంగా, వేగవంతంగా ధాన్యం కొనుగోలు జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ , ఇన్చార్జి జిల్లా మార్కింగ్ అధికారి ప్రసాద్ రావు, సివిల్ సప్లై అధికారులు నిత్యానంద, జగదీష్, డిఆర్డిఓ శ్రీనివాస్ రావు, డిసిఓ పద్మ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయురాలు అంబికా సోనీకి సన్మానం

**ముద్ర ప్రతినిధి, మెదక్:**విద్యారంగంలో విశేష సేవలందిస్తూ, ప్రాథమిక విద్య బలోపేతానికి గత 25 సంవత్సరాలుగా అంకితభావంతో కృషి చేస్తున్న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంబికా సోనీకి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక రవీంద్రభారతిలో సన్మానించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా అంబికా సోనీ గారు విద్యాబోధనలో అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. సమయపాలన, క్రమశిక్షణ,100 శాతం విద్యార్థుల నమోదు, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పాఠశాల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు.




## 6 గ్యారెంటీలు 420 హామీలు అమలు చేయాలి



**బి ఆర్ ఎస్ రాస్తారోకో, అంబేద్కర్ విగ్రహనికి వినతి పత్రం..**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** 6 గ్యారెంటీలు 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుకై బి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వినాయక చౌరస్తా వద్ద ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ సోమవారం అసెంబ్లీ ముందు మహిళా ఎంమ్మెల్యే పట్ల జరిగిన అవమానాన్ని ఖండిస్తూ భువనగిరి మాజీ శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి ఆదేశానుసారం అంబేద్కర్ చౌరస్తా లో నిరసన చేసి 6 గ్యారెంటీలు 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, యువత, మహిళలు, విద్యార్థులను మోసం చేసిన సి ఎం రేవంత్ సర్కార్ తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. . అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహనికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**టిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు**

**ముద్ర, మోత్కూర్:** బిఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న కక్షసాధింపు వైఖరిని బిఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తుందని మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్ అన్నారు. కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదనీ హామీలు నెరవేర్చే వరకు వదిలిపెట్టేది లేదని ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే దాకా ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉం టామన్నారు.

# మట్టి వినాయకులనే పూజిద్దాం

**అదనపు కలెక్టర్ నగేష్ పిలుపు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి, సహజ రంగులతో తయారు చేసిన వినాయక ప్రతిమలను మాత్రమే ప్రతిష్ఠించి పూజించాలని అదనపు కలెక్టర్ నగేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మెదక్ కలెక్టరేట్ లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించాలని కోరుతూ గోడపత్రికలను అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ డా. సిద్ధంశెట్టి మాధురి, హౌసింగ్ పీడీ మాణిక్యం, మెప్మా పీడీ హనుమంత్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదనపు కలెక్టర్ మాటాడుతూ...ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ), రసాయన రంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. నీటి కాలుష్యం ద్వారా పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. ప్రజలు పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలను ఉపయోగించడం ద్వారా నీటి వనరులను, ప్రకృతిని కాపాడేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు.వినాయక చవితి సందర్భంగా భక్తి భావంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ రామచంద్ర రాజు, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి శాఖ అసిస్టెంట్ సైంటిస్ట్ కవిత, సందీప్, భాస్కర్తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల అరెస్ట్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** బకాయిల కోసం అసెంబ్లీకి వెళ్తున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులను పోలీసులు అరెస్ట్ చేశారు. 'చలో అసెంబ్లీ'కి వెళ్తున్న వారిని అడ్డుకున్న పోలీసులుకార్మిక నాయకుడు శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురిని టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా నిరసన తెలిపే వారిని అరెస్ట్ చేయడం భావ్యం కాదని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. తమకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని కోరుతూ తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఐక్యవేదిక చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఇందులో పాలొనేందుకు సిద్ధమైన నేపథ్యంలోనే తమను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఆయన పేర్కొన్నారు.మా డబ్బులు అడగడమే తప్పా అని ప్రశ్నించారు. శాంతియుతంగా మా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనుకుంటున్నాం.రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిల విషయంలో ఎన్నిసార్లు ఆర్టీసీ యాజమాన్యాన్ని సంప్రదించినా ప్రభుత్వం నుంచి నిధులు వస్తే చూస్తామని చెబుతున్నారని ఐక్యవేదిక పేర్కొంది. దీంతో తమ సమస్యను అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపింది. మా హక్కుగా రావాల్సిన బకాయిలు కావాలి. ప్రభుత్వం మా వయసును, పరిస్థితిని అర్థం చేసుకుని వెంటనే సమస్యను పరిష్కరించాలి అని విశ్రాంత ఉద్యోగులు కోరుతున్నారు.

# రెయిన్బో పాఠశాలలో రేడియో హబ్

**ముద్ర దేవరకొండ:** కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని రెయిన్బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు వినూతనంగ రేడియో హబ్ ను ప్రారంభించారు. విద్యార్థులలో మాట్లాడే నైపుణ్యం ఆత్మవిశ్వాసం పెంపొందించడం దీని ద్వారా విద్యార్థులు విద్యా విషయాలు, సాధారణ జ్ఞానం ఆత్మ విశ్వాసం, ఆంగ్ల భాషలో మాట్లాడే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందడం, విద్యార్థులు పాఠ్య పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా వారి ఆలోచనలు స్పష్టంగా వ్యక్త పరచడం, ధైర్యంగా మాట్లాడడం, సనైపుణ్యంవంటి అంశాలను స్వయంగా ప్రచారం చేస్తారు ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలలో దాగిన ప్రతిబను బయటకు తీసి,వారికి వేదిక కల్పించడమే ముఖ్య ఉద్దేశం




# హెడ్ కానిస్టేబుల్ గుండె పోటుతో మృతి

**ముద్ర ప్రతినిధి, మెదక్:** విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ ఆనందం (54) గుండెపోటుతో మృతి చెందారు. మెదక్ జిల్లా ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లోని క్వార్టర్లో విధులు నిర్వహిస్తున్న ఆనందం మంగళవారం చెక్‌పోస్ట్ విధుల నిమిత్తం తూప్రాన్‌కు వెళ్లారు. అక్కడికి చేరుకోగానే ఛాతినొప్పి రావడంతో తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో వైద్యులు ఈసీజీ నిర్వహిస్తున్న సమయంలో ఆనందం ఒక్కసారిగా కుప్పకూలి పోయారు. వెంటనే అప్రమత్తమైన ఆస్పత్రి సిబ్బంది సీపీఆర్ చేశారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం మేడ్చల్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఆనందం మృతి చెందినట్లు ధృవీకరించారు. ఆనందం ఇక లేరనే వార్త తెలియడంతో సహచరులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పలువురు కన్నీటి పర్యంత మయ్యారు.హెడ్ కానిస్టేబుల్ ఆనందం మృతిపట్ల జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసు శాఖకు ఆనందం అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆనందం అంత్యక్రియలను బుధవారం సంగారెడ్డి జిల్లా మల్కాపూర్ గ్రామంలో అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు తెలిపారు.



# ఇదేం ప్రజాస్వామ్యం?

**మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ ఫైర్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:**బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసేందుకు ఎర్రవెల్లి వెళ్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి కారును గౌరారం పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకుని అరెస్టులు చేస్తూ పోలీస్‌స్టేషన్లకు తరలిస్తున్నారని మండిపడ్డారు.కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు బీఆర్ఎస్ నాయకులు వెళ్తుంటే పోలీసులు అడ్డుకుంటున్నారు. మరి కాంగ్రెస్ నాయకులు ఫామ్‌హౌస్ ముట్టడికి వెళ్తుంటే వారిని ఎందుకు అడ్డుకోవడం లేదు, వారికి ఎందుకు సపోర్ట్ చేస్తున్నారని ప్రశ్నించారు.అధికార పార్టీ నాయకులకు ఒక న్యాయం.. ప్రతిపక్ష నాయకులకు మరో న్యాయమా? అంటూ నిలదీశారు. ఎర్రవల్లి కేసీఆర్ ఫామ్ హౌస్ కి బయలుదేరిన మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి ములుగు పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మహిళా పోలీసుల గౌరవాన్ని కించపరిస్తే సహించం

**అసెంబ్లీ వద్ద ఘటనపై జాతీయ మహిళా కమిషన్‌కు ఎంపీ కడియం కావ్య ఫిర్యాదు**

**విధుల్లో ఉన్న మహిళా సిబ్బందినే లక్ష్యంగా చేసుకోవడం దారుణమని ఆగ్రహం**



**ముద్ర, హనుమకొండ, సెప్టెంబర్ 8:** తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలోని గేట్ నంబర్ 3 వద్ద సెప్టెంబర్ 7న జరిగిన ఘటనపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ)కు ఫిర్యాదు చేశారు. విధుల్లో ఉన్న మహిళా పోలీసుల పట్ల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు వ్యవహరించిన తీరు మహిళల గౌరవం, భద్రతకు భంగం కలిగించేలా ఉందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.రాజకీయ పోరాటం పేరుతో మహిళా పోలీసులను అవమానించడం ఏమిటని ఎంపీ ప్రశ్నించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాప్రతినిధులు హుందాతనంతో వ్యవహరించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కు ఉన్నప్పటికీ, విధుల్లో ఉన్న మహిళా సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించడం, అవమానకర వ్యాఖ్యలు చేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు.మహిళా సిబ్బందినే లక్ష్యంగా చేసుకోవడం దారుణంమహిళా పోలీసులను ఉద్దేశించి అసభ్యకర, లింగ వివక్షతో కూడిన వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపిస్తూ ఎంపీ ఎన్‌సీడబ్ల్యూకు ఫిర్యాదు చేశారు. కొందరు బీఆర్ఎస్ నేతలు చొక్కాలు విప్పి బనియన్లతో మహిళా పోలీసులకు సమీపంలో నిలబడటం, భద్రతా వలయాన్ని ఛేదించే క్రమంలో తోపులాట చోటుచేసుకోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు."మహిళల గౌరవం, ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే సమాజానికి ఎలాంటి సందేశం వెళ్తుంది?" అని కడియం కావ్య ప్రశ్నించారు.ఈ ఘటనను కేవలం రాజకీయ వివాదంగా కాకుండా మహిళల గౌరవం, హక్కులు, విధి నిర్వహణలో వారి భద్రతకు సంబంధించిన తీవ్రమైన అంశంగా పరిగణించాలని జాతీయ మహిళా కమిషన్‌ను కోరారు.సుమోటోగా స్పందించాలిమీడియాలో ప్రసారమైన కథనాలు, వీడియో ఆధారాలు, అధికారిక సమాచారాన్ని పరిశీలించి ఎన్‌సీడబ్ల్యూ సుమోటోగా స్పందించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టేలా తెలంగాణ డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ఆదేశాలు ఇవ్వాలని, సంబంధిత ప్రజాప్రతినిధులను కమిషన్ ఎదుట హాజరుపరచి వివరణ తీసుకోవాలని కోరారు.రాజకీయ నిరసనలు, ఆందోళనల సమయంలో మహిళా పోలీసుల పట్ల ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన మార్గదర్శకాలు జారీ చేయాలని కడియం కావ్య సూచించారు. చట్టాన్ని అమలు చేసే మహిళా సిబ్బందినే బెదిరించే లేదా అవమానించే పరిస్థితులు ప్రజాస్వామ్యంలో ఉండకూడదని ఆమె స్పష్టం చేశారు.

## మహిళల ఆర్థిక స్వావలంబనకు స్వయం సహాయక సంఘాలు దోహదం

**అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జిల్లా మహిళా సమాఖ్యను మరింత బలోపేతం చేయాలిమహిళల ఆర్థిక స్వావలంబనకు స్వయం సహాయక సంఘాలు దోహద పడతాయని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా సమాఖ్య 9వ సర్వసభ్య సమావేశం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమాఖ్య కార్యవర్గంలోని రెండు ఖాళీ స్థానాలతో పాటు జిల్లా సమాఖ్య అధ్యక్షురాలి పదవికి ఎన్నికలు నిర్వహించారు.జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా బీబీనగర్ మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్రీమతి తిరునగరి ప్రజావాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షురాలికి సమావేశానికి హాజరైన ప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు మెరుగైన ఆర్థిక అవకాశాలు కల్పించాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా జీవనోపాధి, స్వయం ఉపాధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ నాగిరెడ్డి, అదనపు డిఆర్డిఓ జంగారెడ్డి, మందడి ఉపేందర్ రెడ్డి పాల్గొని నూతనంగా ఎన్నికైన జిల్లా సమాఖ్య అధ్యక్షురాలికి శుభాకాంక్షలు తెలిపారు.నూతనంగా ఎన్నికైన జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తిరునగరి ప్రజావాణి మాట్లాడుతూ జిల్లా మహిళా సమాఖ్యను మరింత బలోపేతం చేసి, మహిళలకు ఆర్థిక అవకాశాలు, జీవనోపాధి, స్వయం ఉపాధి కల్పించడంతో పాటు సామాజిక సాధికారత దిశగా కృషి చేస్తానని తెలిపారు ఈ సమావేశంలో డీపీఎంలు ప్రభాకర్, రవీందర్, ఏపీఎంలు రమణ, మల్లేశం, సి బి ఓ ఎలు మాధవి, బాలరాజు, జిల్లా సమాఖ్య అకౌంటెంట్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

## 104 గ్రాముల గంజాయి స్వాధీనం

**ఇద్దరు యువకులు అరెస్టు**



**ముద్ర, ఆత్మకూరు (ఎస్), సెప్టెంబర్ 8:** సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్) పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయితో పట్టుబడిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. రామన్నగూడెం గ్రామానికి చెందిన అల్లిపురి అఖిల్ (23), మట్టపల్లి గంగరాజు (22)లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సుమారు 104 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు ఆత్మకూరు (ఎస్) పోలీసులు రామన్నగూడెం గ్రామంలో తనిఖీలు నిర్వహించగా, ఇద్దరు యువకులు గంజాయితో పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితులపై NDPS చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు, అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ మంగళవారం సర్కిల్ పోలీస్ కార్యాలయంలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు (ఎస్) ఎస్సై ఐలయ్యతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి కవిత ఫోన్లో పరామర్శ

**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ మండలం పాతూరు గ్రామానికి చెందిన పోచయ్య ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటనపై తెలంగాణ రక్షణ సేన పార్టీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బట్టి అజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కట్టెలను సమీపంలోని అడవిలో నుంచి తీసుకురావడానికి వెళ్లగా ఫారెస్ట్ బీట్ అధికారులు అదుపులోకి తీసుకుని ఫారెస్ట్ రేంజర్ కార్యాలయానికి తీసుకెళ్లారని, అక్కడ తమపై చిత్రహింసలకు పాల్పడ్డారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. తీవ్ర మనోవేదనకు గురైన పోచయ్య అవమానం, బాధను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అయితే ఈ ఘటనకు సంబంధించి పూర్తి స్థాయి, నిష్పక్షపాత దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన పార్టీ మెదక్ ఇంచార్జి బట్టి అజయ్ డిమాండ్ చేశారు. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవితమ్మ సూచనల మేరకు బట్టి అజయ్ పాతూరు గ్రామానికి వెళ్లి పోచయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి బాధను విని, కుటుంబానికి ధైర్యం చెప్పారు. కల్వకుంట్ల కవిత ఫోన్ ద్వారా మాట్లాడి పోచయ్య కుటుంబ సభ్యులతో వారికి ధైర్యం చెప్పారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555